# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం, 24 మార్చి-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## ఉద్యోగుల సమస్యలు తీర్చేదెప్పుడు?



## ఇది కరోనా తరహా సంక్షోభం



- కలిసికట్టుగా ఎదుర్కొందాం
- ఇంధనం, ఎరువుల కొరత తలెత్తకుండా చర్యలు: మోదీ

న్యూఢిల్లీ, మార్చి 23: పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం ప్రభావం తీవ్రంగానే ఉందని, ఇది కరోనా తరహా సంక్షోభ పరిస్థితి అని ప్రధాని మోదీ అభివర్ణించారు. మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ప్రజల జీవితాలపై యుద్ధం ప్రభావం చూపుతోందని, భారత్ కూడా అసాధారణ సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. యుద్ధ ప్రభావం దీర్ఘకాలం కొనసాగే పరిస్థితి కనిపిస్తోందని.. దేశ ప్రజలంతా కలిసికట్టుగా దీనిని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో కొందరు వదంతులు సృష్టిస్తున్నారని, వాటిని నమ్మవద్దని కోరారు. ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధంతో భారత్‌కు ఎదురవుతున్న సవాళ్లపై ప్రధాని మోదీ సోమవారం పార్లమెంటులో ప్రకటన చేశారు. "పశ్చిమా సియాలో యుద్ధం కారణంగా ఏర్పడిన క్లిష్టమైన పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశముంది. కోవిడ్-19 మహమ్మారి వ్యాప్తి సమయంలో మనం ఇలాంటి సవాళ్లను ఎదుర్కొన్నాం. ఇప్పుడు మళ్లీ అదే తరహా సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. మంత్రులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశాం. రోజువారీ ఎగుమతులు, దిగుమతులకు సవాళ్లను రోజువారీగా సమీక్షిస్తూ.. పరిష్కారాలను అన్వేషిస్తున్నాం" అని తెలిపారు.

### ఎరువుల కొరత లేకుండా చూస్తున్నాం..

కోవిడ్ మహమ్మారి, తర్వాత యుద్ధాల కారణంగా కొరత తలెత్తి అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ధరలు అత్యంత భారీగా పెరిగాయని మోదీ చెప్పారు. ఆ ప్రభావం మన దేశ రైతులపై పడకుండా చూసుకున్నామన్నారు. అంతర్జాతీయంగా ఒక యూరియా బస్తా ధర రూ.3 వేలు ఉంటే.. దేశంలో రైతులకు రూ.300కే అందించామని తెలిపారు. సబ్సిడీల కోసం తమ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్లు వ్యయం చేసిందన్నారు. దేశంలో ఎరువులు

## బీసీల మోసకారిరేవంత్‌కు బుద్ధిచెప్పాలి



- 3లక్షల కోట్ల బడ్జెట్‌లో 3.35 శాతమేనా?
- బీసీలకేమైనా ప్రభుత్వం భిక్ష వేస్తున్నదా?
- కాంగ్రెస్ మొదట్నుంచీ మోసం
- ప్రజాక్షేత్రం ద్వారానే రాజ్యాధికారం సాధ్యమవుతుంది
- త్వరలో అన్ని బీసీ సంఘాలతో కలిసి కార్యాచరణ
- అన్ని కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, ఊరూరా బడ్జెట్ పత్రాల దహనం
- అసెంబ్లీ ముట్టడికి బీసీలంతా సిద్ధం కావాలని బీసీ నేతల పిలుపు
- రౌండ్‌టేబుల్ సమావేశంలో కార్యాచరణపై వక్తల స్పష్టీకరణ

మిగతా 2లో..

## మూసీ ప్రక్షాళనపై సబ్ కమిటీ

- ప్రాజెక్టును అడ్డుకోవడం మానుకోవాలి
- బీఆర్ఎస్ ప్రారంభించి వదిలేస్తే..మేం ముందుకు తీసుకెళుతున్నాం
- 50 మీ. బఫర్‌జోన్ నిర్ణయం బీఆర్ఎస్దే
- అభివృద్ధి విషయంలో రాజకీయాలు వద్దు
- శాసనమండలిలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 23: మూసీ ప్రక్షాళనపై క్యాబినెట్ సబ్ కమిటీ వేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుతో ఏర్పాటు చేయనున్న ఈ కమిటీకి.. ప్రతిపక్షాలు సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని సూచించారు. మూసీ ప్రక్షాళనపై ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని, దీనిపై వారికి ఉన్న అభ్యంతరాలేంటని ప్రశ్నించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం శాసనమండలిలో ముఖ్యమంత్రి మాట్లాడారు. మూసీ రివర్ డెవలమెంట్ కార్పొరేషన్‌ను ప్రారంభించింది తామేనని చెప్పుకొనే బీఆర్ఎస్.. ఇప్పుడు ఆపాలని ఎందుకు ప్రయత్నిస్తోందని నిలదీశారు. "మీరు ప్రారంభించి వదిలేస్తే.. మేం ముందుకు తీసుకెళుతున్నాం. ఆపాలని కాకుండా ముందుకు తీసుకెళ్లడానికి సలహాలు ఇవ్వాలి. 50 మీటర్ల బఫర్ జోన్ పరిధిని నిర్ణయించింది కూడా మీరే. దీనిపై అభ్యంతరాలు తెలపాలని సమావేశానికి ఆహ్వానిస్తే.. రాలేదు. ఆన్‌లైన్‌లో వివరాలు చూసి అయినా సలహాలిస్తారను కుంటే.. అదీ చేయలేదు" అని సీఎం అన్నారు. తనకు సూచనలు ఇవ్వడం వారికి ఇబ్బంది అనుకుంటే.. క్యాబినెట్ సబ్ కమిటీ ఇవ్వవచ్చన్నారు.

## బీఆర్ఎస్ వాకౌట్..



- రీయింబర్స్‌మెంట్‌కు కొర్రీ విద్యార్థుల వర్రీ!
- ఉద్యోగుల సమస్యలు తీర్చేదెప్పుడు?.. రిటైర్‌మెంట్ బకాయిలు చెల్లించేదెప్పుడు?
- కాంగ్రెస్ సర్కార్ తీరును నిరసిస్తూ సభను బహిష్కరించిన బీఆర్ఎస్ సభ్యులు
- గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసన
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు
- చట్టసభల్లో నిలదీస్తామని హెచ్చరిక

మిగతా 2లో..

## ఓబీసీల లెక్కలు తేల్చాలి

- 42% రిజర్వేషన్లు ఎంతవరకు వచ్చింది?
- ప్రధాని ఓబీసీయే.. అయినా బడ్జెట్ లేదు
- అధికారం కోసమే బీసీలను వాడుకున్నరు
- ఓబీసీలతో దేశవ్యాప్త పోరాటం
- ఢిల్లీలో జంతర్‌మంతర్ ఓబీసీ ధర్నాలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక

మిగతా 3లో..

## బల్దియా ఔట్‌సోర్సింగ్ కార్మికుల ధర్నా

- వారి సర్వీసులను పర్మినెంట్ చేయాలి: కూనంనేని డిమాండ్



హైదరాబాద్,మార్చి 23: జీహెచ్ఎంసీతోపాటు రాష్ట్రంలోని వివిధ మునిసిపాలిటీల్లోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు తమ సర్వీసులను పర్మినెంట్ చేయాలని ఇందిరా పార్కు వద్ద సోమవారం ధర్నా చేశారు. తెలంగాణ రాష్ట్ర మునిసిపల్ వర్కర్స్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నానుద్దేశించి సీపీఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల అంశంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. జీహెచ్ఎంసీ, మునిసిపాలిటీల్లోని పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 4డీఏలను తక్షణం విడుదల చేసి పీఆర్సీ ప్రకటించాలని కూనంనేని పేర్కొన్నారు. ఏడేళ్లుగా వేతనాలు పెంచక కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 11వ పీఆర్సీ గడువు గతేడాది జూలైతోనే ముగిసిందన్న కూనంనేని.. ఆ కమిటీ ఏం సిఫారసు చేసిందో తెలియదన్నారు. వెంటనే వేతన సవరణ జరగాలని, అంత వరకూ ఒక్కో కార్మికుడికి తాత్కాలిక భృతి కింద రూ.4,000 చెల్లించాలని చెప్పారు. 60 ఏళ్లు దాటిన కార్మికుల వారసులకు ఉద్యోగాలివ్వాలన్నారు.

## దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు





- స్పీకర్, అసెంబ్లీ సెక్రటరీకి కూడా తాఖీదులు ఇచ్చిన కోర్టు
- కౌంటర్‌దాఖలుకు 4వారాలు గడువు
- దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై ఏప్రిల్ 16కు విచారణ వాయిదా

మిగతా 2లో..

## ప్రమాద బీమా చెక్కుల అందజేత



మిగతా 3లో..


## ఇరాన్ యుద్ధంపై ట్రంప్ కీలక ప్రకటన..

- ఉద్రిక్తతలకు తెరపడినట్టేనా..!



న్యూఢిల్లీ, మార్చి 23: పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్కీ లక ప్రకటన చేశారు. ఇరాన్‌తో చర్చలు మంచి వాతావరణంలో జరుగుతున్నాయని తెలిపిన ట్రంప్ తాత్కాలికంగా విరామం ప్రకటిస్తున్నట్టు చెప్పారు. సోమవారం ట్రుత్ సోషల్ పోస్ట్‌లో ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలపై దాడులు నిలిపి వేస్తున్నామని అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. ట్రంప్ ప్రకటనతో మూడు వారాలకు పైగా ఇరుదేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలకు తెరపడే అవకాశముంది.హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచేందుకు ఇరాన్‌కు 48 గంటల సమయం ఇచ్చిన డొనాల్డ్ ట్రంప్ యుద్ధంపై కీలక ప్రకటన చేశారు. మూడు వారాకులపైగా ఇరాన్ నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొన్న ట్రంప్.. తాత్కాలికంగా విరామం ప్రకటిస్తున్నట్టు తెలిపారు. 'అమెరికా, ఇరాన్ మధ్య గత రెండు రోజులుగా మంచి వాతావరణంలో చర్చలు జరుగుతున్నాయని చెప్పడానికి సంతోషిస్తున్నా. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాల రక్షణ గురించి చర్చలు జరుగుతున్నాయి. ఈ వారం మొత్తం ఇరుదేశాల మధ్య పలు అంశాల మీద లోతైన చర్చలు జరగనున్నాయి.

## ఫార్ములా-ఈ కేసులో ఏసీబీ చార్జిషీట్



- ఏ1గా కేటీఆర్, ఏ2గా అరవింద్‌కుమార్..

హైదరాబాద్,మార్చి 23: ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కీలక అడుగు పడింది. నిబంధనలకు విరుద్ధంగా రూ.54.88 కోట్లను విదేశీ సంస్థలకు మళ్లించిన వ్యవహారంపై ఏసీబీ అధికారులు సోమవారం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అందులో ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు, ఏ5గా యూకేకు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ) సంస్థను చేర్చారు.

## రాముడి గోత్రనామాలు మార్చేశారు!

- ప్రవర కూడా చెప్పడం లేదు
- భద్రాద్రి రాములోరి కల్యాణంపై వివాదం
- పిటిషన్ విచారణార్హత తేలాకే ఉత్తర్వులు : హైకోర్టు

మిగతా 2లో..

## అసెంబ్లీలో హీరోలవ్వాలని చూస్తున్నారు

- మంత్రి సీతక్క ఎందుకు టార్గెట్ చేసిందో తెలియదు
- నేను ఆమెపై ఎలాంటి కామెంట్స్ చేయలేదు
- అసెంబ్లీ లాబీల్లో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి చిట్‌చాట్

మిగతా 2లో..

# కోర్టు ధిక్కరణ కేసులో దోషిగా హైడ్రా కమిషనర్..!





హైదరాబాద్, మార్చి 23 : హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు హైకోర్టులో చుక్కెదురైంది. కోర్టు ధిక్కరణ కేసులో తెలంగాణ హైకోర్టు ఆయనను దోషిగా తేల్చింది. బతుకమ్మ కుంట భూమి వ్యవహారంలో ఉద్దేశపూర్వకంగానే రంగనాథ్ కోర్టు ఆదేశాలు ఉల్లంఘించారని సోమవారం హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. స్టేటస్ కో ఆదేశాలు ఉన్నప్పటికీ వివాదంలో ఉన్న భూమిని, ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బతుకమ్మ కుంట నిర్మించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది హైకోర్టు.వివాదంలో ఉన్న బతుకుమ్మ కుంట భూమి వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై విచారించిన హైకోర్టు సోమవారం హైడ్రా కమిషనర్‌ను దోషిగా తేల్చింది. నాలుగు వారాల్లో సదరు భూమిలో చేపట్టిన అన్ని నిర్మాణాలను తొలగించాలని, పూర్తి నివేదికను అందజేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు అత్యున్నత ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. చట్టాన్ని, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన ప్రభుత్వ అధికారులపై కఠిన చర్యలు తప్పవని హైకోర్టు హెచ్చరించింది.

## నేడు గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాలు

హైదరాబాద్, మార్చి 23 : తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీసెట్- 2026) ఫలితాలు మంగళవారం ప్రకటించనున్నట్టు ఎస్సీ గురుకులాల సొసైటీ అధికారులు వెల్లడించా రు. మంగళవారం మధ్యాహ్నం 1:30గంటలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఫలితాలు విడుదల చేస్తారని వివరించారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో, 6నుంచి 9వ తరగతుల వరకు మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహించగా, మొత్తంగా 1,82,061 మంది దరఖాస్తు చేసుకోగా, పరీక్షకు 1,72,842 మంది హాజరయ్యారు.

## ఎప్‌సెట్‌కు దరఖాస్తుల జోరు.. 2 లక్షలు దాటిన అప్లికేషన్లు

### ఏప్రిల్ 4 వరకు తుది గడువు



హైదరాబాద్, మార్చి 23 : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎప్‌సెట్‌కు దరఖాస్తులు ఊపందుకున్నాయి. ఇంటర్ వార్షిక పరీక్షలు ముగియడంతో దరఖాస్తులు జోరందుకున్నాయి. సోమవారం వరకు 2,20,879 మంది దరఖాస్తు చేసుకున్నారు.విభాగాలవారీగా తీసుకొంటే ఇంజినీరింగ్‌కు 1,55,804మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి 64,866, రెండు పేపర్లకు హాజరయ్యేందుకు 209 మంది దరఖాస్తు చేసుకున్నట్టు ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 13వరకు 1.3లక్షల దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు 2.20 లక్షల దరఖాస్తులు వచ్చాయి. పదిరోజుల్లో 90వేలకుపైగా దరఖాస్తులు వచ్చా యి. ఏప్రిల్ 4తో గడువు ముగియనున్నది. ఆలస్య రుసుముతో దరఖాస్తు చేసే అవకాశమున్నది. మే 4 నుంచి 11 వరకు ఎప్‌సెట్ నిర్వహించనున్నారు.

## అసెంబ్లీలో హీరోలవ్వాలని చూస్తున్నారు

- మంత్రి సీతక్క ఎందుకు టార్గెట్ చేసిందో తెలియదు
- నేను ఆమెపై ఎలాంటి కామెంట్స్ చేయలేదు
- అసెంబ్లీ లాబీల్లో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి చిట్‌చాట్



హైదరాబాద్, మార్చి 23 : తెలంగాణ శాసనసభా వేది కగా సాగుతున్న వాదోపవా దాలు, సభ్యుల ప్రవర్తనపై మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. శాసన సభలో ఏది పడితే అది మాట్లాడి, ఇతరులను దూషిస్తే బయట హీరోలుగా చెలామణి అవ్వొ చ్చని కొందరు భ్రమపడుతున్నారని పేర్కొన్నారు. గతంలో అసెంబ్లీ అంటే గౌరవప్రదమైన చర్చలు జరిగేవని, కానీ ఇప్పుడు తిట్టుకోవ డానికే సభ జరుగుతున్నట్టుగా కనిపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆమె అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో ముచ్చటించారు. తనపై మంత్రి సీతక చేసిన వ్యాఖ్యల పట్ల విస్మ యం వ్యక్తంచేశారు.మంత్రి సీతక్క తనను ఉద్దేశించి చేసిన విమర్శలపై సబితా ఇంద్రారెడ్డి స్పందిస్తూ.. 'నేను సీతక్కను ఏమీ అనలేదు. కానీ ఆమె నన్ను ఉద్దేశించి ఎందుకు కామెంట్ చేసిందో నాకైతే ఇప్పటికీ అర్థం కావడం లేదు. ఒకవేళ ఏమైనా అని ఉంటే ఆమెకే తెలియాలి' అని పేర్కొన్నారు. సభలో తాను ఎలాంటి అభ్యం తరకర వ్యా ఖ్యలూ చేయలేదని, అనవస రంగా తనను వివాదంలోకి లాగారని అన్నారు. గతానికీ ఇప్పటికీ ఆస్మాన్ జమీన్ ఫరక్ ఉన్నదని చె ప్పారు. ఒకప్పుడు శాసనసభ అంటే ప్రజా స మస్యలపై అందరం కలిసి చర్చించుకునేవాళ్లమని, కానీ ఇప్పుడు తిట్టుకోవడానికే సభను వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా.. ప్రతి పక్షాలు వారి లోపాలను ఎత్తిచూపడం సహజమని, కానీ ఇప్పు డు సభ జరుగుతున్న తీరుపైనే చర్చించాల్సిన దుస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు.

# ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతిలో స్కామ్

- నిజాయితీ ఉంటే వెంటనే హౌస్ కమిటీ వేయండి
- ఫైళ్లు స్పీకర్ ముందుపెడితే స్కామ్‌ను నిరూపిస్తా
- సర్కార్‌కు హరీశ్‌రావు సవాల్



హైదరాబాద్, మార్చి 23 : ఫిలిప్పీన్స్‌కు బియ్యం అంశంపై అసెంబ్లీలో దుమారం చెలరేగింది. రైస్ ఎగుమతిలో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపణలు చేయడంతో సభలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. దీనిపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేసిన ఆయన, నిజాయితీ ఉంటే ఫైళ్లు స్పీకర్ ముందు పెడితే స్కామ్‌ను నిరూపిస్తానని అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో సర్కార్‌కు సవాల్ విసిరారు. బియ్యం ఎగుమతి చేసేందుకు సర్కార్ నియమించిన అడ్వైజర్ ప్రేమ్‌చంద్ గార్గ్ ఘరానా మోసగాడని విమర్శించారు. ఈడీ, సీబీఐ కేసుల్లో జైలుకు వెళ్లిన వ్యక్తిని సలహాదారుగా పెట్టుకోలేదా? అతడి సలహా వల్లే రాష్ట్రానికి నష్టం జరిగింది నిజం కాదా? అని సర్కార్‌ను నిలదీశారు. ధాన్యం సేకరణలో రికార్డు.. రికార్డు అంటున్నారు.. ఇదెక్కడి రికార్డు అంటూ జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ సర్కార్ రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ చేసిందని రికార్డులను సభ ముందుంచారు. 2019-20లో 111లక్షల మెట్రిక్ టన్నులు.. 2020-21లో 141లక్షల మెట్రిక్ టన్నులు, 2021-22లో 120.65, 2022-23లో 131లక్షల మెట్రిక్ టన్నులు అని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2023లో 95.31లక్షల మెట్రిక్ టన్నులు. 2024లో 100.31లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారని ఇదెలా రికార్డ్ అవుతుందో చెప్పాలని నిలదీశారు. 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకే కేంద్రం అనుమతిచ్చిందని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ తరుణంలో వరి ధాన్యం కొంటారో లేదో స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. కేంద్రాలను ఆలస్యంగా తెరువడం వల్ల రైతులకు మద్దతు ధర రావడం లేదని ఆరోపించారు. గత యాసంగి సన్నవడ్ల బోనస్ రూ.1,208కోట్ల బకాయిలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. దొడ్డు వడ్లకు సైతం రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు.

**నాఫెడ్‌కు బియ్యం ఎందుకు ఇవ్వలేదు..**కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ.. నాఫెడ్ కు బియ్యం ఎందుకివ్వలేదని హరీశ్‌రావు అసెంబ్లీలో నిలదీశారు. అడ్వాన్స్‌గా డబ్బులిస్తామని నాఫెడ్ జేఎండీ, ఎండీ లేఖ రాసి నా ఇవ్వని ప్రభుత్వం.. టెండర్లు పిలువకుండా నామినేషన్ పద్ధతిలో ఫిలిప్పీన్స్‌కు ఎందుకు ఎగుమతి చేసిందని ప్రశ్నించారు. ఇదొక ఇంటర్నేషనల్ అగ్రిమెంట్ అని, తమ విజయమంటూ గొప్పలు చెప్పుకొని హెలికాప్టర్‌లో కాకినాడకు వెళ్లి మంత్రి జెండా ఊపారు.. కానీ ఇప్పుడది పెద్దస్కామ్‌గా మారిందన్నారు. 27,500 మెట్రిక్ టన్నుల వద్దనే ఎగుమతులు ఎందుకు ఆ గాయని ప్రశ్నించారు. ఇక 7,500 మెట్రిక్ టన్నుల బియ్యం ఏడాది నుంచి కాకినాడ పోర్టులో పురుగులు పట్టి వృథాగా ఉంటే.. గోదాం, హ్యాండ్లింగ్ చార్జీల భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడటం లేదా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. కావాలంటే అందరం కాకినాడ పోర్టుకు వెళ్దామని చెప్పారు.

# ఉద్యోగుల సమస్యలు తీర్చేదెప్పుడు?

- రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలెప్పుడిస్తరు?
- కొత్త పీఆర్సీ, 5 డీఏలు ఎప్పుడు ఇస్తరు?
- అసెంబ్లీలో బీఆర్ఎల్పీ ఉపనేత హరీశ్
- గళమెత్తిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- సర్కార్ తీరును నిరసిస్తూ వాకౌట్



హైదరాబాద్, మార్చి 23 : రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళమెత్తారు. వారి పట్ల సర్కార్ చిన్నచూపు చూస్తున్నదని అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో మండిపడ్డారు. పీఆర్సీ ఎప్పుడు ప్రకటిస్తారో, ఐదు పెండింగ్ డీఏలు, రిటైర్మెంట్ ఉద్యోగుల బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. సర్కార్ చెప్తున్న మానవీయ కోణం మాటల్లో తప్ప.. చేతుల్లో లేదని మండిపడ్డారు. ఇంకా ఎంతకాలం గత ప్రభుత్వం మీద, బీఆర్ఎస్ మీద పడి ఏడుస్తారని ప్రశ్నించారు. మూడు నెలల్లో ఇస్తామన్న హామీ ఏమైంది? అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో కొత్త పీఆర్సీ ఇస్తామన్న హామీ ఏమైందని అసెంబ్లీలో బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు నిలదీశారు. ఈ నెల 31తో పీఆర్సీ కమిటీ గడువు ముగుస్తుందని, గడువును మళ్లీ పొడిగిస్తారా? అని ప్రశ్నించారు. వెంటనే నివేదిక తెప్పించుకుని పీఆర్సీ ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలోనే ఐదు డీఏలు పెండింగ్‌లో పెట్టారని, ఎప్పటిలోగా చెల్లిస్తారో సమాధానం చెప్పాలని కోరారు. గతంలో కేసీఆర్ మధ్యంతర భృతి (ఐఆర్) ఇచ్చి ఆదుకున్నారని, ఐఆర్ పెంచి ఉద్యోగులకు ఉపశమనం కలిగించాలని సూచించారు.రాష్ట్రంలో ఎంతమంది ఉద్యోగ విరమణ చేశారు? వారికి చెల్లించాల్సిన బెనిఫిట్స్ ఎంత? ప్రభుత్వం ఇప్పటివరకు ఎంత చెల్లించింది? మిగతా బకాయిలు ఎప్పటిలోగా చెల్లిస్తారో సభలో స్పష్టంచేయాలని డిమాండ్ చేశారు. సర్కార్ తీరుతో రిటైర్మెంట్ తరువాత ప్రశాంతంగా ఉండాల్సిన వారు మంత్రులు, సచివాలయం చుట్టూ తిరగాల్సి వస్తున్నదని, రోడ్ల మీద ధర్నాలు చేయాల్సిన దారుణ పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు డబ్బులు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర నిధుల్లేవా? సర్కార్‌కు మనసు లేదా? అని ప్రశ్నించారు. 'ఫ్యూచర్‌సిటీకి రూ.లక్ష కోట్లు.. మూసీకి రూ.లక్ష కోట్లు.. అందాల పోటీలకు, ఫుట్‌బాల్ షోలకు డబ్బులుంటాయి. వంద కోట్లతో క్యాంప్ ఆఫీస్ కట్టుకుంటారు. భట్టి మూడో క్యాంప్ ఆఫీస్ కట్టుకుంటారు. వీటన్నింటికీ డబ్బులుంటాయి కానీ, ఉద్యోగుల పీఆర్సీ, డీఏలకు డబ్బుల్లేవంటారు. ఇదేం పద్ధతి? అని హరీశ్‌రావు నిలదీశారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు సమస్యలపై సర్కార్ స్పష్టమైన సమాధానం చెప్పకపోవడంతో అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను ఇంతవరకు చెల్లించలేదని అసెంబ్లీలో బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద విమర్శించారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామన్న హామీని కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. హైకోర్టు మొట్టికాయలేస్తే, దళారులకు కమీషన్లు ఇస్తేనే బకాయిలు విడుదల చేస్తున్నారని దుయ్యబట్టారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ఎప్పుడు అమలు చేస్తారని, ఐదు డీఏలను ఎప్పుడు చెల్లిస్తారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రశ్నించారు. ఆర్టీసీ సిబ్బందికి కొత్త పీఆర్సీ ఇప్పుడిస్తారో చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆర్టీసీ అప్పాయింటెడ్ డే ఖరారుచేసి సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా ఎప్పుడు గుర్తిస్తారో, ఆర్టీసీలో యూనియన్లను ఎప్పుడు పునరుద్ధరిస్తారో చెప్పాలని ప్రభు త్వాన్ని నిలదీశారు. సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.

# బెడిసికొట్టిన బెదిరింపు వ్యూహం!

- మధుపార్క్ అపార్ట్‌మెంట్‌పై సర్కార్ కొత్త ఎత్తుగడ
- బాధితులను విభజించి, ఒప్పించేందుకు ప్రణాళిక
- పరిహారంగా 11 రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల పరిశీలన
- ఏడెకరాల్లో కొత్త అపార్ట్‌మెంట్ నిర్మాణానికి హామీ
- ఇంటితో బంధం ముందు చిత్తయిన ప్రలోభాలపర్వం
- స్థానికుల వరుస నిరసనలతో ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి




హైదరాబాద్, మార్చి 23 : ఇల్లు అంటే రియల్ ఎస్టేట్ వ్యాపారికి వ్యాపార వస్తువు. పిల్లర్లు, సిమెంట్, ఇటుకలతో చేసిన ఓ నిర్మాణం మాత్రమే. కానీ ఆ ఇంట్లో నివాసం ఉంటున్న వారికి అది విడదీయలేని మధుర జ్ఞాపకాల కేంద్రం. ఇలాంటి సెంటిమెంట్ల ముందు ఎలాంటి వ్యూహాలు.. ఎన్ని రకాల ప్రలోభాలైనా పని చేయవని మరోసారి తేటతెల్లం అయ్యింది. అది చూసి ప్రభుత్వం తెల్లబోయింది. మూసీ సుందరీకరణ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం హైదర్‌షా కోట్ పరిధిలోని మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్‌ను సేకరించాలని ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. అయితే అపార్ట్‌మెంట్‌వాసులు ఎదురుతిరగడంతో రకరకాల ప్రయత్నాలు చేస్తున్నది. నోటిఫికేషన్ ఇచ్చి బెదిరించినా, జీరోవాల్యూ అంటూ అవమానించినా వారు పట్టు విడవడం లేదు. ఈ నేపథ్యంలో పాలకులు కొత్త వ్యూహాలు అమలు చేయగా, అవి కూడా బెడిసికొట్టాయి. విలువ కట్టలేని తమ గూడును కాపాడుకునేందుకు పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టును ముందుకు తీసుకుపోయేందుకు ప్రభుత్వం మధు పార్కు రిడ్జ్ అపార్టుమెంట్‌వాసులపై సామ, దాన, భేద, దండోపాయాలను వరుసగా ప్రయోగిస్తున్నదనే విమర్శలు ఉన్నాయి. ఏడెకరాలకు భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత అపార్ట్‌మెంట్‌వాసులు పెద్ద ఎత్తున నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. దీంతో మొదట్లో చర్చలు అంటూ బుజ్జగించే ప్రయత్నం చేసినా ఫలితం ఇవ్వలేదు. దీంతో కొత్త మార్గాలు ఎంచుకున్నట్టు విమర్శలు వస్తున్నాయి. తెర ముందు కాకుండా తెర వెనుక ప్రణాళికను అమలు చేసేందుకు ప్రాధాన్యం ఇచ్చిందని చెప్తున్నారు. ముందుగా రెండు బ్లాకులుగా ఉన్న అపార్ట్‌మెంట్‌వాసుల్లో చీలిక తెచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరిని ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఇలా వివిధ కోణాల్లో ప్రత్యేకంగా పిలిపించుకొని మాట్లాడారని, ఫ్లాటును వదిలివెళ్లేందుకు ఒప్పించాలని ప్రయత్నించారని అంటున్నారు. మరికొందరిపై మరో మార్గంలో ఒత్తిడి తెచ్చారని సమాచారం. ఈ క్రమంలో కొందరు ప్రాథమికంగా అంగీకరించి ఆందోళనలకు దూరంగా ఉన్నారని, అయినా అత్యధిక శాతం మంది మాత్రం ఎట్టి పరిస్థితుల్లో అపార్ట్‌మెంట్‌ను వీడేందుకు ఒప్పుకోవడం లేదని స్థానికులు చెప్తున్నారు.ప్రభుత్వం భూసేకరణ చేపడితే బాధితులకు గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిన 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలి. కానీ రేవంత్‌రెడ్డి సర్కార్ అందుకు భిన్నమైన వైఖరి ఎంచుకున్నదని సచివాలయ వర్గాలు తెలిపాయి.



# బీఆర్ఎస్ వాకౌట్..

- గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసన
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు
- చట్టసభల్లో నిలదీస్తామని హెచ్చరిక

హైదరాబాద్,మార్చి 23 : 'ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కొర్రీ.. పేద విద్యార్థులకు వర్రీ.. విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వం నశించాలి.. వెంటనే నిధులువిడుదల చేయా లి.. గ్యారెంటీలకు తిలోదకాలు..ప్రజలకు పంగ నామాలు' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎ మ్మెల్యేలు సోమవారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద నిరసన తెలిపారు. శాసనమండలి ప్రతిపక్ష నేతసిరికొండ మధుసూదనాచారి ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలతో హోరెత్తించారు.మధుసూదనాచారి మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ పేద విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్నదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు.రూ.12 వేలకోట్ల బకాయిలు పెట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆపార్టీ ముఖ్యమంత్రి వైఎస్సార్ తీసుకొచ్చిన స్కీమ్‌కు తూట్లు పొడుస్తున్నదని ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు రోడ్డునపడే పరిస్థితి నెలకొన్నదని సిరికొండ ఆవేదన వ్యక్తంచేశారు. వారి తరఫున చట్టసభల్లో సర్కార్‌ను నిలదీస్తామని, అవసరమైతే క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# ఓబీసీల లెక్కలు తేల్చాలి



- 42% రిజర్వేషన్లు ఎంతవరకు వచ్చింది?
- ప్రధాని ఓబీసీయే.. అయినా బడ్జెట్ లేదు
- అధికారం కోసమే బీసీలను వాడుకున్నరు
- లక్షలాది ఓబీసీలతో దేశవ్యాప్త పోరాటం
- ఢిల్లీలో జంతర్‌మంతర్ ఓబీసీ ధర్నాలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 23: దేశవ్యాప్తంగా ఓబీసీ కుటుంబాల లెక్క తేల్చాలని, ఈ విషయంలో ప్రభుత్వాలు తమ చిత్తశుద్ధిని నిరూపించాలని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ఓబీసీల ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. జనగణన విషయంలో ఎస్సీలు, ఎస్టీల కుటుంబాల కోసం ప్రత్యేక కాలం ఏర్పాటుచేసినట్టే 34వ కాలంగా ఓబీసీ కుటుంబాల కోసం పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. స్వయంగా ప్రధానమంత్రి ఓబీసీయే అయినప్పటికీ ఒక్క మంత్రిత్వ శాఖ గానీ, బడ్జెట్‌లో నిధులు కానీ పెట్టలేదని తవిమర్శించారు. అదే విధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశం ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నదని, ప్రస్తుతం ఆ ఫైల్ ఎంతవరకు వచ్చిందో ఊసేలేదని దుయ్యబట్టారు. బీసీ, ఓబీసీలను ఓటు బ్యాంకుగా వాడుకోవడం తప్ప వారికి న్యాయం చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 20 ఏండ్ల తర్వాత కులగణన చేస్తామని ఈ ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రకటించిందని, ఇదే విషయాన్ని చాలా రాష్ట్రాల్లో ప్రచారంలో గొప్పగా చెప్పారంటూ ధ్వజమెత్తారు. భవిష్యత్తులో లక్షలాది మంది ఓబీసీలతో కలిసి దేశవ్యాప్తంగా పోరాటం చేస్తామని, జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తామని ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.

## రాముడి గోత్రనామాలు మార్చేశారు!

- ప్రవర కూడా చెప్పడం లేదు
- భద్రాద్రి రాములోరి కల్యాణంపై వివాదం
- పిటిషన్ విచారణార్హత తేలాకే ఉత్తర్వులు : హైకోర్టు



హైదరాబాద్, మార్చి 23 : భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో 2012 నుంచి పూజా విధానాలను మార్చడంపై దాఖలైన పిటిషన్ల విచారణార్హతను తేల్చాల్సిన అవసరం ఉన్నదని హైకోర్టు స్పష్టంచేసింది. ఆ తర్వాతే ఈ వ్యవహారంపై ఉత్తర్వులిస్తామని కోర్టు వెల్లడించింది. శ్రీరాముడి కల్యాణం సందర్భంగా సీతారాముల గోత్రనామాలు, వారి ప్రవర చెప్పడం లేదని, వాటిని మార్చడం చెల్లదంటూ 2022లో దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూరేపల్లి నంద సోమవారం మరోసారి విచారించారు. గతంలో ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా పిటిషన్ల విచారణార్హతతో పాటు సింగిల్ జడ్జి ఆదేశాల మేరకు నిపుణుల కమిటీ నివేదికను పరిశీలించిన తర్వాతే తగిన ఆదేశాలిస్తామని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ ఈ కేసులో అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారని, ఏజీ హాజరుకు వీలుగా గడువు కావాలని కోరారు. పిటిషన్ల విచారణార్హతపై ఈ నెల 25న ఏజీ వాదనలు వినిపించాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఆలయ సంప్రదాయాలు, వ్యవస్థాపకుల నిర్దేశించిన మేరకు పూజా విధానాలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాదులు కోరారు. రాజ్యాంగంలోని 25, 26 అధికరణ ప్రకారం పూజా విధానాల్లో మార్పు లు చేసే వీల్లేదని చెప్పారు. రాజ్యాంగ అధికరణాల ఉల్లంఘన జరిగినపుడు పిటిషన్ విచారణార్హమని తెలుపగా, ఇరుపక్షాల వాదన నిమిత్తం విచారణ ఈ నెల 25కి వాయిదా పడింది.

balagamtv100@gmail.com

## మూసీ ప్రక్షాళనపై సబ్ కమిటీ

కలుషిత మూసీ జలాల వల్ల ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసులు ఎదుర్కొనే సమస్యలను కళ్లారా చూసిన వారెవరైనా ఈ ప్రాజెక్టుకు అడ్డు చెప్పరని వ్యాఖ్యానించారు. ఇకనైనా ప్రాజెక్టును ఆపాలన్న ఆలోచన నుంచి బయటకు రావాలని, రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టాలని సూచించారు. మూసీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న వారెవరినీ నిరాశ్రయులను చేయబోమని, మెరుగైన వసతులతో పునరావాసం కల్పిస్తామని తెలిపారు. ఎవరూ రాజకీయ పార్టీల ఉచ్చులో పడొద్దన్నారు. రాజకీయ పార్టీలు కూడా ప్రజల్లో అపోహలు సృష్టించవద్దని, అభివృద్ధికి అడ్డుపడవద్దని కోరారు.

## ఇది కరోనాతరహా సంక్షోభం

తగిన మొత్తంలో ఉన్నాయని, రైతులకు ఎలాంటి సమస్య రాకుండా చూస్తున్నామని తెలిపారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని, విద్యుత్ సరఫరా వ్యవస్థలు, బొగ్గు నిల్వలను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.

### భారతీయుల రక్షణకు చర్యలు

గల్ఫ్ దేశాల్లో కోటి మంది వరకు భారతీయులు ఉన్నారని, దీనితో భారత్ ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడిందని మోదీ చెప్పారు. కొందరు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు గాయపడ్డారని.. వారందరికీ తగిన సహాయం అందుతోందని తెలిపారు. గల్ఫ్ దేశాల నుంచి 3 లక్షలమందికిపైగా భారతీయులు సురక్షితంగా తిరిగి వచ్చారని చెప్పారు. ఇరాన్ నుంచి వెయ్యి మంది తిరిగివచ్చారని తెలిపారు. పశ్చిమాసియా దేశాల నేతలందరితోనూ మాట్లాడానని, భారతీయుల రక్షణ కోసం చర్యలు చేపట్టాల్సిందిగా కోరానని వివరించారు. యుద్ధాన్ని ఆపేందుకు భారత్ ప్రయత్నిస్తోందని.. చర్చల ద్వారా ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని చెప్పారు.

### పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేకుండా చూస్తున్నాం..

దేశ ప్రజలకు సాధ్యమైనంత మేరకు ఇంధన కష్టాలు లేకుండా చూస్తున్నామని మోదీ చెప్పారు. భారత్ 60 శాతం ఎల్పీజీ (వంట గ్యాస్)ని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోందని, హోర్ముజ్ మూసివేతతో సరఫరాలో అనిశ్చితి ఏర్పడిందని తెలిపారు. ఈ క్రమంలో దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామని వివరించారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా నిరాటంకంగా సాగుతోందని.. రకరకాల మార్గాల నుంచి చమురు, గ్యాస్‌ను సమీకరిస్తున్నామని తెలిపారు. మొత్తం 41 దేశాల నుంచి ఇంధన దిగుమతులు జరుగుతున్నాయని చెప్పారు. అదే సమయంలో దేశంలో సౌర శక్తి, అణు ఇంధన శక్తి సామర్థ్యాన్ని పెంచుతున్నామని వివరించారు. ప్రస్తుత సంక్షోభాల వంటి పరిస్థితుల్లో బ్లాక్ మార్కెట్ దందాలు చేసేవారు, నిల్వదారులు లాభం పొందేందుకు ప్రయత్నిస్తారని.. అలాంటి వాటిని నియంత్రించేందుకు భద్రతా వ్యవస్థలను కట్టుదిట్టం చేశామని చెప్పారు. ఎవరైనా గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ వంటివాటిని భారీగా నిల్వ చేస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. అనిశ్చిత పరిస్థితుల నుంచి ప్రయోజనం పొందేందుకు కొందరు వదంతులను వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తారని, జాగ్రత్త పడాలని సూచించారు.

## ఫార్ములా-ఈ కేసులో ఏసీబీ చార్జిషీట్

2023లో హైదరాబాద్‌లో నిర్వహిం చిన ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించి ఒప్పందాల్లో నిబంధ నల ఉల్లంఘన జరిగిందని, విదేశీ సంస్థ అయిన ఎఫ్ఈవోకు చట్ట విరుద్ధంగా రూ.54.88 కోట్లను మళ్లించారంటూ ఏసీబీ గతంలో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో పురపాలక శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆదేశాల మేరకే తాను ఆ నిధులు విడుదల చేసినట్టు.. ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన అరవింద్‌కుమార్ ఏసీబీ విచారణలో వెల్లడించారు. తదుపరి దర్యాప్తు పూర్తి చేసిన ఏసీబీ తాజాగా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది.

## అప్పు చేసి ఇల్లు కట్టినా బిల్లులు మాత్రం రాలేదు..



ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు ఆవేదన

**హైదరాబాద్, మార్చి 23:** శివ్వంపేట మండలంలోని బిక్యా తండా గ్రామపంచాయతీకి చెందిన ధనావత్ లక్ష్మి అనే పేద మహిళ ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుని కూడా బిల్లు అందక ఇబ్బందులు పడుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది. కూలి పనులు చేసుకుంటూ గుడిసెలో జీవనం సాగిస్తున్న లక్ష్మిని అధికారులు నిర్వహించిన సర్వేలో గుర్తించిన ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. అధికారులు ఇంటి స్థలానికి వచ్చి ప్రభుత్వం నిబంధనల ప్రకారం ముగ్గు పోసి కొలతలు తీసి నిర్మాణ పనులు ప్రారంభించమని సూచించారు. దీంతో ధనావత్ లక్ష్మి అప్పులు చేసి ఇంటి నిర్మాణాన్ని చేపట్టి స్లాబ్ లెవెల్ వరకు పూర్తి చేసింది. నిర్మాణం పూర్తయిన తరువాత అధికారులకు సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి ఫోటోలు తీసుకుని వెళ్లినట్లు ఆమె తెలిపింది. ఇంటి నిర్మాణానికి సంబంధించి రెండు బిల్లులు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు ఒక్క బిల్లు కూడా రాకపోవడంతో లక్ష్మి తీవ్ర ఆందోళనకు గురవుతోంది. బిల్లు కోసం పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ వస్తుంది...వస్తుంది అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆమె ఆరోపించింది. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ ఎదుట తన గోడును వినిపించిన లక్ష్మి 'మేడం... దండం పెడతా... అప్పు చేసి ఇల్లు కట్టాను.. బిల్లు మాత్రం రావడం లేదు. నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి నడుచుకుంటూ కార్యాలయానికి వస్తున్నాను. ఎన్నిసార్లు వచ్చినా బిల్లు వస్తుందని చెప్పి పంపిస్తున్నారు. గుడిసె కూల్చి ఇప్పుడు పక్కింటి వారి ఆవరణలో ఉంటున్నాను అంటూ కన్నీటి పర్యంతమైంది. ఈ విషయంపై ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ స్పందిస్తూ.. మరో తండాలో గతంలో ఇందిరమ్మ ఇల్లు లక్ష్మి పేరుపై తీసుకున్నట్లు రికార్డుల్లో చూపిస్తోందని తెలిపారు. అయితే విచారణలో ఈ లక్ష్మి బిల్లు తీసుకోలేదని తేలిందని, పేరు విషయంలో పొరపాటు జరిగిందని పేర్కొన్నారు. పూర్తి వివరాలతో పై అధికారులకు లేఖ పంపించి సమస్యను పరిష్కరించే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

# బీసీల మోసకారిరేవంత్‌కు బుద్ధిచెప్పాలి

- 3లక్షల కోట్ల బడ్జెట్‌లో 3.35 శాతమేనా?
- బీసీలకేమైనా ప్రభుత్వం భిక్ష వేస్తున్నదా?
- కాంగ్రెస్ మొదట్నుంచీ మోసం
- ప్రజాక్షేత్రంలోకి వెళ్లడం ద్వారానే రాజ్యాధికారం సాధ్యమవుతుంది
- త్వరలో అన్ని బీసీ సంఘాలతో కలిసి కార్యాచరణ రూపొందిస్తాం
- అన్ని కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, ఊరూరా బడ్జెట్ పత్రాల దహనం
- అసెంబ్లీ ముట్టడికి బీసీలంతా సిద్ధం కావాలని బీసీ నేతల పిలుపు
- రౌండ్‌టేబుల్ సమావేశంలో కార్యాచరణపై వక్తల స్పష్టీకరణ




**హైదరాబాద్, మార్చి 23 :** బీసీలను మొదటినుంచీ మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని వక్తలు స్పష్టంచేశారు. బీసీ జనసభ ఆధ్వర్యం లో 'బీసీలకు మరో మోసం-తెలంగాణ రాష్ట్ర బడ్జెట్' అంశంపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి హాజరై మాట్లాడారు. బీసీలకు నమ్మకద్రోహం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, 42శాతం రిజర్వేషన్లు, ఏడాదికి రూ.20వేల కోట్ల బడ్జెట్, బీసీలకు సబ్‌ప్లాన్‌లో చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐదేండ్లలో లక్ష కోట్లు ఖర్చుపెడుతానని చెప్పారని, కానీ ఆ సంఖ్య రూ. 20వేల కోట్లు కూడా దాటడం లేదని విమర్శించారు. ఎంబీసీలకు మంత్రిత్వశాఖ, బడ్జెట్‌లో కేటాయింపు చేస్తామని చెప్పి ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. బీసీల రాజ్యాధికారం కోసం ప్రజాక్షేత్రంలో పోరాడాలని పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్ చరిత్ర మొత్తం మోసమే,,** దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ చరిత్ర మొత్తం మోసమేనని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ విమర్శించారు. నెహ్రూ, ఇందిరల నుంచి మొదలుకొని రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ, నేటి రాహుల్ వరకు అందరూ బీసీలను మోసం చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. నాడు కేసీఆర్ చేపట్టిన కులగణనలో బీసీలు 51శాతం ఉన్నట్టు తేల్చితే, రేవంత్‌రెడ్డి మాత్రం 46శాతానికి తగ్గించారని, బీసీలకు బడ్జెట్‌లో లక్ష కోట్లు అని చెప్పి 2024-25లో 9,200 కోట్లకు 2,068 కోట్లు, 2025-26లో రూ.11,405.31 కోట్లకు రూ.3,500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఇక ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.12,511 కోట్లు కేటాయించి ఎంత ఖర్చుచేస్తారో తెలియదని మండిపడ్డారు. బడ్జెట్‌లో కాంగ్రెస్ మోసాన్ని నిరసిస్తూ యావత్ బీసీ సంఘాలతో చర్చించి అన్ని కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, ఊరూరా బడ్జెట్ ప్రతులు దహనం చేసి, చివరగా అసెంబ్లీని ముట్టడిస్తామని స్పష్టంచేశారు.

**రాజకీయ సంకల్పం కావాలి..** బీసీలకు రాజకీయ సంకల్పం కావాలని, తద్వారా సాహిత్య, సాంస్కృతికరంగాలు కలిసి పనిచేస్తేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని జూలూరు గౌరీశంకర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు 200మంది బీసీ బిడ్డలు చనిపోయినా కాంగ్రెస్ పార్టీ జెండా మోసే బీసీలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బీసీబిడ్డల చావులను ఆపేందుకు కేసీఆర్ ముందుకురావాలని, వెలుగుమట్ల, కుమ్మెరలో ఉద్యమం వచ్చిందని, అదే స్ఫూర్తితో కాంగ్రెస్‌కు ఘోరీ కట్టే చైతన్యం రావాలని కోరారు. ప్రొఫెసర్ జయశంకర్, కాళోజీల స్ఫూర్తిగా తీసుకోవాలని, ప్రతి ఊరు బీసీ లగచర్ల కావాలని, గ్రామగ్రామాల్లో బడ్జెట్ పత్రాలను దహనం చేయాలని పిలుపునిచ్చారు.

**బడ్జెట్ కేటాయింపులకు మనసు రావడం లేదు**

బీసీలకు కేటాయించినట్టు చెబుతున్న రూ.12,511కోట్లలో ఈడబ్ల్యూఎస్, ఈబీసీలకు పోగా నిజమైన బీసీ వర్గాలకు మిగిలేది ఏమీ ఉండదని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు చిరంజీవులు ఆవేదన వ్యక్తంచేశారు. ఏపీలో రూ.3.32లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.51వేల కోట్లను బీసీలకు కేటాయించారని గుర్తుచేశారు. కేంద్ర బడ్జెట్‌లో రూ.54.30వేల కోట్లలో బీసీలకు కేటాయించింది కేవలం రూ.2,200కోట్లు మాత్రమేనని, తెలంగాణలోనూ అదే దారుణ పరిస్థితి నెలకొన్నదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో రూ.45వేల కోట్లలో బీసీలకు 60శాతం ఖర్చుపెట్టడంతో పాటు కులవృత్తులకు సైతం చేయూతనందించిందని గుర్తుచేశారు. అందాల పోటీలు, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడి కార్యక్రమానికి వందల కోట్లు, ఇటీవల జరిగిన గద్దర్ అవార్డుల కార్యక్రమంలో ఒక్కో యాంకర్‌కు రూ.60లక్షలు ఇచ్చారని, కాని బీసీల విషయానికి వచ్చే సరికి కేటాయింపులకు మనసు రావడం లేదని విరుచుకుపడ్డారు.

**ఖజానాలో డబ్బులు లేవంటే దిగిపో**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 42శాతం ఇస్తామన్న రిజర్వేషన్లు 17శాతం మాత్రమే ఇచ్చి మోసగించిందని యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ దుయ్యబట్టారు. ప్రభుత్వం ఎన్ని మోసాలు చేసినా స్థానిక సంస్థ ఎన్నికల్లో 50శాతానికి పైగా బీసీలు గెల్చుకున్నారని గుర్తుచేశారు. ఖజానాలో డబ్బులు లేవని సీఎం రేవంత్‌రెడ్డి తరచూ అంటున్నారని, ఒకవేళ డబ్బులు లేకపోతే పదవి నుంచి వైదొలగాలని హితవు పలికారు. బీసీలను మోసగించిన కాంగ్రెస్‌ను వచ్చే ఎన్నికల్లో భూస్థాపితం చేస్తామని తేల్చిచెప్పారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తం పటేల్, కాటం నర్సింహా యాదవ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు యాదయ్య గౌడ్, రాజారాం యాదవ్, అయోధ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా


### కూనంనేని



**హైదరాబాద్, మార్చి 23:** రాష్ట్రంలో జీహెచ్ఎంసీతోపాటు మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ వర్కర్స్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద 'మున్సిపల్ కార్మికుల మహాధర్నా' నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. సుమారు నలభై ఏండ్ల క్రితమే కొత్తగూడెంలో మున్సిపల్ కార్మికుల సంఘాన్ని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. మున్సిపల్‌లో పర్మినెంట్ కార్మికులతోతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు సమానంగా పని చేస్తున్నారని, కానీ వారి జీతాల్లో మాత్రం వ్యత్యాసం ఎందుకని ప్రశ్నించారు. కార్మికులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తానని, సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ మాట్లాడుతూ..కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పనులు ఆపేసి సమ్మెకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఎస్ బాల్‌రాజ్, కే రవిచంద్రన్, కే ఏసురత్నం, వనంపల్లి జైపాల్ రెడ్డి, కాంతారావు, హరినాథ్‌రావు, ఎం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు

- స్పీకర్, అసెంబ్లీ సెక్రటరీకి కూడా తాఖీదులు ఇచ్చిన కోర్టు
- కౌంటర్‌దాఖలుకు 4వారాలు గడువు
- దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై ఏప్రిల్ 16కు విచారణ వాయిదా





**హైదరాబాద్, మార్చి 23:** బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై విచారణ జరిపిన అసెంబ్లీ స్పీకర్ ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్‌ను స్పీకర్ కొట్టివేస్తూ ఈ నెల 11న వెలువరించిన తీర్పును బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హైకోర్టులో సవాలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన ధర్మాసనం చేపట్టింది. ప్రతివాదులైన దానం, స్పీకర్, ట్రిబ్యునల్ చైర్మన్, అసెంబ్లీ సెక్రటరీకి నోటీసులు జారీచేస్తూ తమ వాదనలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఇందుకు నాలుగు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది. అంతకుముందు సీనియర్ న్యాయవాది కేవీ వెంకటరెడ్డి వాదనలు వినిపిస్తూ పిటిషనర్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై తొలుత స్పీకర్ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, దీంతో ఈ వివాదం హైకోర్టు, ఆపై సుప్రీంకోర్టు వరకు వెళ్లిందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాతే విచారణ జరిపిన స్పీకర్ (ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో) అనర్హత పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు చెప్పారని వివరించారు. బీహార్‌కు చెందిన మహాచంద్రప్రసాద్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఒక పార్టీ తరపున చట్టసభకు ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ తరపున ఎన్నికల్లో పోటీకి నామినేషన్ దాఖలు చేసినట్లయితే స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నట్టు భావించాలని తెలిపారు. బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ బీ ఫారం తీసుకొని, లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానం నుంచి పోటీచేశారని చెప్పారు. ఆ ఎన్నికల్లో ఆయన బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేశారని తెలిపారు. ఈ విషయంలో స్పీకర్.. దానం నాగేందర్ అసెంబ్లీ బయట నిర్వహించే వ్యవహారాలను చూడటంలేదని, సభలో జరిగిన వ్యవహారాలనే పట్టించుకుంటానని పేరొనడం సరికాదని అన్నారు. స్పీకర్ తీర్పు చట్టవిరుద్ధంగా ఉన్నదని చెప్పారు. ఆ తీర్పు లోపభూయిష్టమని, చట్టవ్యతిరేకమని ప్రకటించాలని కోరారు.

దానం పార్టీ ఫిరాయింపునకు పాల్పడటం వల్ల దాని ప్రభావం ప్రభుత్వంపై ఏమీ ఉండదని, అస్థిరతకు గురిచేయదని స్పీకర్ తేల్చడం దారుణమని అన్నారు. దానం పార్టీ ఫిరాయింపు వల్ల శాసనసభలో అధికార, విపక్ష పార్టీల మెజారిటీపై కూడా ఎలాంటి ప్రభావం చూపదనడాన్ని తప్పుపట్టారు. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీ తరపున బహిరంగంగా చట్టసభ ఎన్నికల్లో పోటీ చేసినట్టు ఆధారం కంటికి కనిపిస్తున్నప్పుడు.. వేరొకరి సాక్ష్యం అవసరం లేకుండానే స్పీకర్ అతనిపై అనర్హత వేటు వేయకపోవడం శోచనీయమని అన్నారు. ఒక పార్టీ నుంచి ఎన్నికై మరో పార్టీ తరపున పోటీ చేశారంటే అది పార్టీ ఫిరాయింపు కిందికే వస్తుందని చెప్పారు. ఇలాంటి వ్యవహారంపై ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును స్పీకర్ పట్టించుకోలేదని తెలిపారు. ఒక పార్టీకి చెందిన సభ్యుడు మరో పార్టీ తరపున పోటీ చేసినట్టయితే తన మొదటి రాజకీయ పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్టేనని హైకోర్టు డివిజన్ బెంచ్ గతంలో వెలువరించిన తీర్పును స్పీకర్ విస్మరించారని చెప్పారు. ఈ సందర్భంగా అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి కల్పించుకుంటూ.. హైకోర్టు జారీచేసిన నోటీసులను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. అయితే, రెండో ప్రతివాది దానం నాగేందర్ కౌంటరు దాఖలు చేయాలని చెప్పడంపై పిటిషనర్ న్యాయవాది వెంకట్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం చెప్పారు. గతంలో స్పీకర్, దానం తమ వాదనలతో కౌంటర్లు దాఖలు చేశారని గుర్తుచేశారు. ఇరుపక్షాల వాదనల అనంతరం ధర్మాసనం, ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది.

## కొణతం దిలీప్‌కు పాస్‌పోర్ట్ తిరిగి ఇవ్వండి



- చట్టబద్ధత లేకుండా స్వాధీనం అధికార దుర్వినియోగం కిందికే వస్తది
- ఇది పౌర హక్కులను హరించే చర్యే
- పోలీస్‌ల తీరుపై హైకోర్టు అసహనం

**హైదరాబాద్, మార్చి 23:** సోషల్ మీడియాలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారంటూ వరుస కేసులతో డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కొ ణతం దిలీప్ పాస్‌పోర్ట్‌ను వెంటనే తిరిగి ఇవ్వాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. నిరుడు జూలై 10న అమెరికా నుంచి తిరిగి వచ్చిన కొణతం దిలీప్‌ను శంషాబా ద్ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకుని నిర్మల్ కోర్టులో హాజరుపర్చారు. కోర్టు పోలీసుల రిమాండ్ రిపోర్ట్‌ను తిరస్కరించి దిలీప్‌కు బెయిల్ మం జూరు చేసింది. పోలీసులు దిలీప్ నుంచి స్వాధీనం చేసుకున్న పాస్ పోర్ట్‌ను తిరిగివ్వలేదు. కోర్టులో డిపాజిట్ కూడా చేయలేదు.

## ప్రమాద బీమా చెక్కుల అందజేత



**హైదరాబాద్, మార్చి 23:** విద్యుత్తు ఉద్యోగులకు 1.20కోట్ల ప్రమాద బీమా పథకం అమలును సర్కార్ ప్రారంభించింది. సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇద్దరు లబ్ధిదారుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. దక్షిణ డిస్కమ్‌లో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పనిచేస్తూ 2025 అక్టోబర్ 10న మరణించిన వరుస సురేశ్, మహబూబ్‌నగర్ సర్కిల్లో పనిచేస్తూ మరణించిన ఆర్టిజన్ ముక్తార్‌బేగ్ కుటుంబాలకు చెక్కులు అందజేశారు.

## ఆధార్ అనుసంధానంలేని ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

**హైదరాబాద్, మార్చి 23:** ఆధార్ అనుసంధానం లేని కారణంగా నిలిచిపోయిన ఉద్యోగుల వేతనాలను చెల్లించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. వ్యవసాయశాఖలో నిలిచిపోయిన వేతనాలు చెల్లించాలని కోరుతూ టీఎన్జీవో నేతలు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును అసెంబ్లీలో కోరారు. విద్యాశాఖలో 221మంది టీచర్ల వేతనాలు నిలిపివేశారని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) అధ్యక్షప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, టీ పెంటయ్య ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని కోరారు.

# తిరుమలలో భక్తుల రద్దీ

- ఒక్కరోజే 86 వేల మందికి పైగా దర్శనం -- హుండీ ఆదాయం రూ.4.21 కోట్లు

**బలగం టీవీ, తిరుమల**

తిరుమల, సోమవారం: తిరుమల శ్రీవారి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. మార్చి 22న ఒక్కరోజే 86,091 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. భక్తుల రద్దీ పెరగడంతో శ్రీవారి హుండీ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ఆదివారం ఒక్కరోజే రూ.4.21 కోట్ల కానుకలు హుండీ ద్వారా సమకూరినట్లు తెలిపారు. అదే సమయంలో 29,664 మంది భక్తులు తలనీలాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ప్రస్తుతం టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని అధికారులు తెలిపారు. కొండపై భారీ రద్దీ నెలకొనడంతో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయి క్యూ లైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. శనివారంతో పోలిస్తే ఆదివారం భక్తుల సంఖ్య, హుండీ ఆదాయం రెండూ పెరిగాయి. మార్చి 21న 77,864 మంది భక్తులు దర్శనం చేసుకోగా రూ.3.33 కోట్ల ఆదాయం వచ్చినట్లు టీటీడీ వెల్లడించింది. ఇదిలా ఉండగా, తిరుమలలో మార్చి 30 నుంచి ఏప్రిల్ 1 వరకు సాలకట్ల వసంతోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఇప్పటికే ప్రకటించింది.

# వికారాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- కారు--ఆటో ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

వికారాబాద్ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఒకే కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్న కుటుంబ సభ్యులు ప్రమాదానికి గురికావడంతో ఆందోళన నెలకొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పూడూరు మండలం రాకంచర్ల గేటు సమీపంలో అతివేగంగా వచ్చిన కారు, ఆటోను ఎదురెదురుగా ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు వెంటనే స్పందించి పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారంతా కోడంగల్ మండలం ఫర్సాపూర్ తండాకు చెందిన ఒకే కుటుంబ సభ్యులుగా గుర్తించారు. హైదరాబాద్‌లో జరిగిన పెళ్లి వేడుకకు హాజరై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం అనంతరం కారులో ఉన్న వ్యక్తులు వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యారు. పూడూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి కారు నంబర్ ప్లేట్ ఆధారంగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



# ప్రధాని మోదీకి మరో రికార్డు

- 8,931 రోజుల పాటు ప్రభుత్వాధినేతగా సేవలు

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో అరుదైన రికార్డు నెలకొల్పారు. విరామం లేకుండా 8,931 రోజుల పాటు ప్రభుత్వాధినేతగా పనిచేసిన వ్యక్తిగా ఆయన నిలిచారు. ఇప్పటివరకు ఈ రికార్డు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉండగా, తాజాగా మోదీ ఆయన రికార్డును అధిగమించారు.

పవన్ కుమార్ చామ్లింగ్ 8,930 రోజుల పాటు సిక్కిం ముఖ్యమంత్రిగా పనిచేశారు. మోదీ 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి, 2014 వరకు ఆ పదవిలో కొనసాగారు. అనంతరం 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టి ఇప్పటికీ కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి హోదాలతో కలిపి మొత్తం 8,931 రోజుల పాటు ప్రభుత్వాధినేతగా సేవలందించారు. అదే సమయంలో గుజరాత్ రాష్ట్రానికి అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన రికార్డు కూడా మోదీ పేరిటే ఉంది. ముఖ్యమంత్రిగా అత్యధిక అనుభవం కలిగిన ప్రధానిగా కూడా ఆయన గుర్తింపు పొందారు.

స్వాతంత్ర్యానంతరం జన్మించి, దీర్ఘకాలం ప్రధానిగా ఉన్న తొలి కాంగ్రెసేతర నేతగా మోదీ నిలిచారు. అలాగే కేంద్రంలో రెండు పదవీకాలాలను పూర్తి చేసి మూడోసారి అధికారంలోకి వచ్చిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా కూడా రికార్డు సృష్టించారు. జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత దేశానికి అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగుతున్న రెండో నేతగా కూడా ఆయన నిలిచారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, పీయూష్ గోయల్, అశ్విని వైష్ణవ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు తదితరులు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో దేశం కొత్త మైలురాళ్లు చేరుకుంటోందని పేర్కొన్నారు.

# పూర్తి రుణమాఫీపై ప్రతిపాదన లేదు

**పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ స్పష్టం**



**బలగం టీవీ, హైదరాబాద్**

సోమవారం: రైతులకు పూర్తి రుణమాఫీకి సంబంధించి ఎలాంటి ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో వెల్లడించారు. అయితే రైతుల ఆర్థిక పరిస్థితులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని ఆమె వివరించారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ (కెసిసి) పథకం ద్వారా రైతులకు సకాలంలో తగినంత రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద రూ.3 లక్షల వరకు పంట రుణాన్ని రాయితీ వడ్డీ రేట్లతో అందిస్తున్నట్లు చెప్పారు. సవరించిన వడ్డీ రాయితీ పథకం (ఎంఐఎస్ఎస్) కింద రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లిస్తే అదనపు ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నట్లు గుర్తు చేశారు.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) జారీ చేసిన ప్రాధాన్య రంగ రుణాల మార్గదర్శకాల ప్రకారం పూచీకత్తు లేని స్వల్పకాలిక వ్యవసాయ రుణాల పరిమితిని రూ.1.60 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచినట్లు తెలిపారు. వ్యవసాయంతో పాటు ఇతర ప్రాధాన్య రంగాలకు బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా తగినంత రుణ ప్రవాహం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని లోక్‌సభకు ఇచ్చిన సమాధానంలో పేర్కొన్నారు. అదనంగా ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం ద్వారా రైతులకు నేరుగా నగదు బదిలీ, పంటల బీమా వంటి సదుపాయాలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం

**దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుమార్తెలకు గాయాలు**

**బలగం టీవీ, హైదరాబాద్**



హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జూబ్లీహిల్స్ దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుమార్తెలు అక్షర (23), దిశీర (19) తీవ్రంగా గాయపడ్డారు. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలంగాణ పోలీస్ అకాడమీ జంక్షన్ సమీపంలో రాత్రి సుమారు 8.52 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వీరితో పాటు కారులో ప్రయాణిస్తున్న అభిరామ రెడ్డి, డ్రైవర్ అరికపూడి దుర్గా సాయి కూడా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బాధితులు ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ కారు అతివేగంగా వెళ్తుండగా ముందుగా వెళ్తున్న డీసీఎం వాహనం టైరు అకస్మాత్తుగా ఊడిపోవడంతో అది రోడ్డుపై ఆగిపోయింది. దీంతో వెనుక నుంచి వస్తున్న కారును డ్రైవర్ నియంత్రించలేక డీసీఎంను బలంగా ఢీకొట్టాడు. ప్రమాద ధాటికి ఫార్చ్యూనర్ కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది.

ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన వారిని గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. పెద్ద కుమార్తె అక్షర పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. దిశీరకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసుపత్రికి చేరుకుని అక్షర ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నార్సింగి పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు.

# పెట్టుబడుల పేరుతో భారీ మోసం...

- వెలుగులోకి క్యూ నెట్ కుంభకోణం
- 32 మంది నిందితుల అరెస్ట్



**బలగం టీవీ, హైదరాబాద్**

మల్టీ లెవల్ మార్కెటింగ్ పేరుతో భారీ కుంభకోణం నగరంలో వెలుగులోకి వచ్చింది.క్యూనెట్ పేరుతో దేశవ్యాప్తంగా వేల కోట్లను వసూళ్లు చేసిన నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. 11మంది మహిళలతోపాటు మొత్తం 32 మందిని అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి కీలక పత్రాలు, కంప్యూటర్లును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పాత పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్ వివరాలు వెల్లడించారు.

సులువుగా డబ్బులు సంపాదించాలని వ్యాపార వేత్త వహాన్ పథకం ప్రకారం 'క్యూఐ గ్రూప్'ను ఏర్పాటు చేశాడు. కొంత మందితో కలిసి సెల్లింగ్ మల్టీ లెవల్ మార్కెటింట్ పేరుతో 'క్యూనెట్'గా విస్తరించాడు. హాంకాంగ్ కేంద్రంగా గతంలో గోల్డ్ క్వెస్ట్, క్వెస్ట్ నెట్ పేర్లతో దేశవ్యాప్తంగా విస్తరించాడు. 1998 నుంచి వివిధ సంస్థల పేర్లతో మోసాలకు పాల్పడుతున్నారు. ఈ ముఠా ప్రధానంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను, నిరుద్యోగులను, గహిణులను, వ్యాపారవేత్తలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులు హైటెక్ సిటీలోని ప్రముఖ హోటళ్లలో సమావేశాలు నిర్వహించి ఈ–కామర్స్ వ్యాపారం, పెట్టుబడుల పేరుతో ప్రజలను ఆకర్షించారు.. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెట్టుబడి పెడితే రెండేండ్లలో రూ.3 నుంచి రూ.4 కోట్ల వరకు లాభం వస్తాయని బాధితులు నమ్మించారు. బాధితులు డబ్బు చెల్లించిన తర్వాత వారి ప్రమేయం లేకుండానే ఆ మొత్తాన్ని వస్తువుల కొనుగోలుకు మళ్లించి, వాటిని కంపెనీ ఇచ్చిన బహుమతులుగా నమ్మించేవారు. ఇందులో చేర్పించిన వారికి కమీషన్లు ఇస్తామని గాలం వేశారు. హైదరాబాద్‌లో 22 మంది బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు విచారణ చేపట్టారు. 30 బృందాలను ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా సోదాలు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఏకకాలంలో చేపట్టిన ఆపరేషన్‌లో 32 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.ప్రస్తుతం నమోదైన నాలుగు కేసుల్లో 11 మంది బాధితుల నుంచి సుమారు రూ.75 లక్షల మేర వసూళ్లు చేసినట్టు తేలిందని సీపీ తెలిపారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

మల్టీలెవల్ మార్కెట్ పేరుతో భారీ మోసాలు జరుగుతున్నాయని వాటి పట్లజాగ్రత్తగా ఉండాలని సీపీ సూచించారు. మోసపూరిత మల్టీ లెవల్ మార్కెటింగ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

# భద్రాచలంలో వసంత పక్ష తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- శ్రీరామనవమి రోజున శ్రీసీతారాముల కళ్యాణం
- ఏప్రిల్ 2 వరకు ఉత్సవాలు



**బలగం టీవీ, హైదరాబాద్**

భద్రాచలంలో కొలువుదీరిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో వసంత పక్ష తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అభిషేకం, ఆరాధన, తిరుమంజన సేవలను నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపును ఏర్పాటు చేయనున్నారు. స్థానిక తాతగుడి సెంటర్ వద్దనున్న ఆలయంలో భూమి పూజ, వాస్తు పూజ నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ఉగాది ఉత్సవాల సందర్భంగా సాయంత్రం దేవాలయంలో పంచాంగ శ్రవణం కూడా నిర్వహించనున్నారు.

మార్చి 27న శ్రీరామనవమి సందర్భంగా శ్రీసీతారాముల కళ్యాణం ఘనంగా జరగనుంది. మార్చి 28న శ్రీరామ మహా పట్టాభిషేకాన్ని నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో ఏప్రిల్ 2 వరకు దేవాలయంలో జరిగే నిత్య కళ్యాణాలను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు ఆలయ ఉన్నతాధికారులు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు పక్క రాష్ట్రాల నుంచి కూడా భారీగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ, స్థానిక అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలంకు ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడపనుంది.

# ప్రయాగ్‌రాజ్‌లో కోల్డ్ స్టోరేజ్ కూలి నలుగురు మృతి



- అమ్మోనియా గ్యాస్ లీక్ కారణంగా పేలుడు అని అనుమానం
- 12 మందికి గాయాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కోల్డ్ స్టోరేజ్ భవనం కూలిపోవడంతో నలుగురు కార్మికులు మృతి చెందగా, మరో 12 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మరియు ఇతర సహాయక బృందాలు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. కోల్డ్ స్టోరేజ్‌లో అమ్మోనియా గ్యాస్ లీక్ కావడంతో పేలుడు సంభవించి భవనం కూలిపోయి ఉండవచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనకు గల అసలు కారణాలను తెలుసుకునేందుకు విచారణ ప్రారంభించామని జిల్లా మేజిస్ట్రేట్ మనీష్ కుమార్ వర్మ తెలిపారు. ప్రమాదంపై దర్యాప్తు చేసేందుకు ఏడీఎం ఫైనాన్స్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసినట్లు, అది 24 నుంచి 48 గంటల్లో నివేదిక సమర్పించే అవకాశం ఉందని వెల్లడించారు.

ఇదిలా ఉండగా, ఈ ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించగా, గాయపడిన వారికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ఘటనపై సంతాపం వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం

# తమిళనాడు ఎన్నికలు.. ఎన్డీఏలో సీట్ల పంపకం ఖరారు

- ఏఐఏడీఎంకేకు 178, బీజేపీకి 27 స్థానాలు



**బలగం టీవీ, హైదరాబాద్**

తమిళనాడు శాసనసభ ఎన్నికల నేపథ్యంలో విపక్ష ఎన్డీఏ కూటమిలో సీట్ల పంపకం దాదాపు ఖరారైంది. కూటమిలో భాగంగా ఏఐఏడీఎంకే 178 స్థానాల్లో, బీజేపీ 27 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు నిర్ణయించారు. అలాగే పీఎంకేకు 18, ఏఎంఎంకేకు 11 నియోజకవర్గాలను కేటాయించారు. ఈ సందర్భంగా ఏఐఏడీఎంకే నేత ఎడప్పాడి కె. పళనిస్వామి మాట్లాడుతూ సీట్ల పంపకం చర్చలు సజావుగా జరిగాయని తెలిపారు. కూటమిలోని పార్టీల మధ్య పరస్పర అవగాహనతో అధికారికంగా స్థానాల కేటాయింపుపై నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. తమ కూటమిలోని ఇతర చిన్న పార్టీలకు ఇవ్వాల్సిన స్థానాలపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

# గల్ఫ్‌లో భారతీయుల రక్షణకు చర్యలు

- పశ్చిమాసియా యుద్ధం భారత్‌కు సవాళ్లు
- లోక్‌సభలో ప్రధాని మోదీ



**బలగం టీవీ, హైదరాబాద్**

సోమవారం: పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు నివసిస్తున్నారని, గల్ఫ్ దేశాల్లో ఉన్న వారి రక్షణకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టిందని ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో వెల్లడించారు. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులపై ఆయన ప్రసంగిస్తూ, గత మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందని పేర్కొన్నారు.


భారత్ ఇంధన అవసరాల్లో పశ్చిమాసియా కీలక పాత్ర పోషిస్తోందని గుర్తు చేసిన ప్రధాని, ప్రస్తుత యుద్ధం దేశానికి పలు సవాళ్లు తీసుకొచ్చిందన్నారు. యుద్ధ ప్రభావం ప్రజలపై తీవ్రంగా పడుతోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని 24 గంటలూ కంట్రోల్ రూములు, హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా దేశానికి తిరిగి వచ్చారని వెల్లడించారు.

పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, పశ్చిమాసియా పరిస్థితిని ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తున్నట్లు మోదీ తెలిపారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాలో హార్మూజ్ జలసంధి కీలకమని ఆయన పేర్కొన్నారు.

దేశ ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రస్తుతం దేశంలో 60 శాతం ఎల్పీజీ ఉత్పత్తి జరుగుతోందని చెప్పారు. అలాగే 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ నిల్వలు ఉన్నాయని, హార్మూజ్ మార్గం ద్వారా మరిన్ని నౌకలు భారత్‌కు చేరుతున్నాయని వివరించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయ్యిందని తెలిపారు. ప్రపంచానికి ఆర్థిక మాంద్యం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో భారత్‌పై దాని ప్రభావం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు దేశం సిద్ధంగా ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# రాజన్న జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్..

- అప్రమత్తమైన కోర్టు సిబ్బంది.. పోలీసులకు సమాచారం
- డాగ్, బాంబు స్క్వాడ్‌లతో విస్తృత తనిఖీలు




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత నెలకొంది. జిల్లా ప్రధాన న్యాయస్థానానికి బాంబు బెదిరింపు మెయిల్ రావడం కలకలం రేపింది. ఆదివారం గుర్తు తెలియని అకౌంట్ నుంచి కోర్టు అధికారిక ఈమెయిల్ ఐడికి పంపిన మెయిల్‌లో, కోర్టు ప్రాంగణంలో బాంబు పెట్టి పేలుస్తామని హెచ్చరించారు.సోమవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన కోర్టు సిబ్బంది ఈ మెయిల్‌ను గమనించి వెంటనే అప్రమత్తమయ్యారు. ఘటనపై వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ బృందాలతో కోర్టు ప్రాంగణానికి చేరుకుని విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అయితే ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో ఆ మెయిల్‌ను ఫేక్ అని పోలీసులు నిర్ధారించారు. బాంబు బెదిరింపు సమాచారం తెలిసి కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, వాదిదారులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం అది హోక్స్ అని తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కోర్టు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు రావడం ప్రస్తుతం జిల్లా కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది.

# డిజిటల్ విధానంలో రాష్ట్ర స్థాయి జనగణన..

- ప్రభుత్వ పథకాల కోసం డేటా సేకరణ
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
ప్రభుత్వ పథకాలను రూపకల్పనకు, వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు జనగణన చాలా ఉపయోగపడుతుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. జనగణన 2027 లో భాగంగా సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ పోర్టల్, మొబైల్ యాప్, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో హౌస్ లిస్టింగ్, బ్లాక్స్ డిజిటల్ విధానంలో సిద్ధం చేయడం, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం తదితర అంశాలపై పై చార్జ్ సహాయకులు, సాంకేతిక సహాయకులకు శిక్షణ కార్యక్రమం జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో సోమవారం ప్రారంభించారు.
కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడుతూ.. జనగణన - 2027 ను ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో డిజిటల్ విధానంలో జరిగే మొదటి జనగణనని, మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని తెలిపారు. ఆరోగ్య, అక్షరాస్యత, జనాభా, లింగ నిష్పత్తి, వలసలు, ఉపాధి నివాస స్థితి తదితర అంశాల వివరాలు జనగణనతో ప్రభుత్వం వద్ద ఉంటాయని అన్నారు . శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయించాలని ఆదేశించారు. ఈ శిక్షణలో జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, గణాంక అధికారి సంపత్, డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్ నుంచి స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్స్ శ్రేయ, శిరీష, తదితరులు పాల్గొన్నారు

## పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ.



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని గీతా నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఏ, బీ వింగ్ పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా పరిశీలించారు సౌకర్యాలను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట విద్యాశాఖ అధికారులు మరియు సంబంధిత సిబ్బంది ఉన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్
- సిరిసిల్లలో కాంగ్రెస్ సమావేశం..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సంగితం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ మల్లుగారి పద్మ నర్సాగౌడ్ మరియు పలువురు వార్డ్ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, మాజీ ఎమ్మెల్యే కట్కం మృత్యుంజయం స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనను బలోపేతం చేయడమే పార్టీ లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, గ్రామ స్థాయి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ ప్రగతిశీల ఆలోచనలతో ప్రేరణ పొందుతూ, రైతులు, కార్మికులు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. గ్రామ పంచాయితీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు కలిసి పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఏర్పడిన తరువాత కొన్ని ప్రాంతాలు అభివృద్ధిలో వెనుకబడ్డాయని విమర్శిస్తూ, ముఖ్యంగా సిరిసిల్ల పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి లోపించిందని పేర్కొన్నారు. గంభీరావుపేట మండలం వంటి ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.
రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి గ్రామం, ప్రతి వార్డ్‌లో పార్టీ బలోపేతం చేయాలని నాయకులు సూచించారు. భవిష్యత్తులో రాష్ట్రంలో అభివృద్ధి, పారిశ్రామిక వృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు.

# బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి.. కాంగ్రెస్‌లో వెనుకబాటు..

- రిబ్బన్ కట్టింగ్‌లకే పరిమితమైన కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్ పట్టణ యువజన అధ్యక్షుడు సుంకపాక మనోజ్ కుమార్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకెళ్లగా, కాంగ్రెస్ పాలనలో వెనుకబాటు కనిపిస్తోందని బీఆర్ఎస్ పట్టణ యువజన అధ్యక్షుడు సుంకపాక మనోజ్ కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌పై బీఆర్ఎస్ పట్టణ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ యువజన అధ్యక్షుడు సుంకపాక మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలతో పాటు అదనంగా ఇచ్చిన హామీలు కూడా అమలు కాకపోవడం ప్రజలను నిరాశకు గురిచేస్తోందన్నారు. గ్యారంటీల అమలు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, లక్షల సంఖ్యలో ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదని, నిరుద్యోగ యువతను మోసం చేసిందని, గతంతో పోలిస్తే ఉద్యోగాల భర్తీ చాలా తక్కువగా ఉందన్నారు.
ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించిన నిధులను తగ్గించడం, ఇప్పటికే కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించకపోవడం వల్ల పేదల గృహ నిర్మాణాలు నిలిచిపోయాయని,రైతు భరోసా నిధులను కూడా పూర్తి స్థాయిలో ఖర్చు చేయకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు.హైదరాబాద్ నగర అభివృద్ధిని పక్కనపెట్టి "ఫ్యూచర్ సిటీ" పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, మూసి నది ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లను కూల్చడం అన్యాయమని పేర్కొన్నారు. ముందుగా కాలుష్యానికి కారణమైన వనరులను గుర్తించి చర్యలు తీసుకోవాలని అన్నారు.అలాగే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికలు లేకుండా మాటలకే పరిమితం అవుతోందని, అందాల పోటీలు నిర్వహించడం ద్వారా పెట్టుబడులు వస్తాయని చెప్పడం సరైన విధానం కాదని అన్నారు .మూసి ప్రాజెక్ట్, ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్‌ను సినీ హబ్‌గా అభివృద్ధి చేసే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లింగన్నపేట బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం...

**బలగం టీవీ, గంభీరావుపేట:**
గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట బస్టాండ్ ఆవరణలో చలివేంద్రంను ఎస్సై అనిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ మాట్లాడుతూ, ఇంత మంచి కార్యక్రమాన్ని 18 ఏళ్లుగా హరిహర ఆటో యూనియన్ నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఇలాంటి అరుదైన, సామాజిక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాలని ప్రజలకు సూచించారు. వేసవికాలంలో ప్రజలకు దప్పిక సమస్యలు ఏర్పడకుండా, చల్లని, సురక్షిత తాగునీరు అందించడం ముఖ్యమని, ప్రతి ఏడాది బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిట్ల ఎల్లం,ఉప సర్పంచ్ నర్సింలు, వార్డు సభ్యులు, మాజీ ఉపసర్పంచ్ దుబాసిరాజు, హరిహర ఆటో యూనియన్ అధ్యక్షులు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బాపూరావు, కోశాధికారి రాజు, కాంగ్రెస్ నాయకులు గంగి స్వామి, జోగు సురేష్, మరియు వార్డు సభ్యులు వేణుగోపాల్, చారి, పాపారావు పాల్గొన్నారు





# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి..

- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించారు. మొత్తం 167 అర్జీల రాగా, సంబంధిత అధికారులకు అందజేశారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.



# టీపీఎస్ ఏర్పాటును పరిశీలించిన కలెక్టర్

- సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సందర్శన

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) ఏర్పాటుకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం పరిశీలించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయంలో స్కూల్, జూనియర్ కళాశాల కొనసాగుతుండగా, పరిశీలించి.. విద్యార్థుల సంఖ్య, ఎన్ని గదులు, ఎంత విస్తీర్ణంలో ఉందో ఆరా తీశారు. గ్రౌండ్, కంప్యూటర్ ల్యాబ్ కూడా పరిశీలించారు. ఈ పరిశీలనలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, తహసీల్దార్ మహేష్ కుమార్. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# బొమ్మెన గ్రామంలో గౌడ సంఘం ఈత వనం ధ్వంసం

- రూ.3.5 లక్షల నష్టం, న్యాయం కోరుతున్న బాధితులు..

**బలగం టీవీ, జగిత్యాల:**
జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామంలో గౌడ కుల సంఘానికి చెందిన ఈత వనం పై దాడి జరిగి తీవ్ర ఆస్తి నష్టం కలిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. గౌడ సంఘ సభ్యుల వివరాల ప్రకారం, వారి జీవనోపాధి అయిన కల్లు గీత వృత్తి కోసం ప్రభుత్వం సర్వే నంబర్ 59/1 లో ఐదు ఎకరాల భూమిని కేటాయించింది. ఆ భూమిలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటిన ఈత చెట్ల ద్వారా వారు ఉపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో, 2026 మార్చి 20వ తేదీ శుక్రవారం నాడు గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఈత వనాన్ని అక్రమంగా ఆక్రమించి, గడ్డ పారలు మరియు గొడ్డళ్లతో సుమారు 300 ఈత చెట్లను పీకివేసి, డ్రిప్ ఇరిగేషన్ పైపులను ధ్వంసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో దాదాపు రూ.3.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఈ విషయమై గౌడ సంఘ సభ్యులు మెట్పల్లి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మరియు కథలాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. తమ జీవనోపాధికి తీవ్ర భంగం కలిగిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని ఈత వనం చుట్టూ కంచె ఏర్పాటు చేయడం, కొత్త చెట్లను నాటించడం, నీటి పారుదల సదుపాయం కల్పించడం, అలాగే జరిగిన నష్టానికి తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.






# బీసీ సబ్ ప్లాన్ చట్టబద్ధ అమలు కోసం డిమాండ్..

అంబేద్కర్ ఆశయాల సాధనకు కట్టుబాటు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
భారత రాజ్యాంగ నిర్మాత, మహానుభావుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, దేశంలోని వెనుకబడిన వర్గాల సమగ్ర అభివృద్ధి కోసం బీసీ సబ్ ప్లాన్‌ను చట్టబద్ధంగా అమలు చేయాలని బీసీ వర్గాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం రోజున సిరిసిల్ల పట్టణ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు.
వారు వెల్లడించిన ప్రకారం, అంబేద్కర్ రచించిన రాజ్యాంగం సమానత్వం, సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణకు బలమైన పునాది వేసింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యత, న్యాయం పూర్తిస్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రకటిస్తున్న పథకాలు, బడ్జెట్ కేటాయింపులు ఉన్నప్పటికీ అవి సమర్థవంతంగా అమలు కావడం లేదని, ప్రత్యేకంగా బీసీల అభివృద్ధికి కేటాయించిన నిధులు ఇతర అవసరాలకు మళ్లుతున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో, ఎస్సీ/ఎస్టీ లకు ఉన్నట్లే బీసీలకు కూడా వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు చేసి, వాటిని విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక అభివృద్ధి కోసం ఖర్చు చేయాలని కోరారు. "సమాజంలో సమానత్వం లేకుండా ప్రజాస్వామ్యం బలపడదు" అనే అంబేద్కర్ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టాలంటే బీసీ సబ్ ప్లాన్ కీలకమని వారు స్పష్టం చేశారు. అందువల్ల, బీసీ వర్గాల అభ్యున్నతి మరియు సామాజిక న్యాయం కోసం బీసీ సబ్ ప్లాన్‌ను చట్టబద్ధంగా అమలు చేయాలని, అంబేద్కర్ ఆశయాలను మార్గదర్శకంగా తీసుకుని ముందుకు సాగుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ హాస్పిటళ్లలో భారీగా పోస్టుల భర్తీ

- మంత్రి దామోదర్ రాజనర్సింహ



**బలగం టీవి, హైదరాబాద్**
ప్రభుత్వ హాస్పిటళ్లలో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు సహా అవసరమైన అన్ని రకాల పోస్టులను దశలవారీగా భర్తీ చేస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. గత రెండేళ్లలో సుమారు 10 వేల పోస్టులను భర్తీ చేయగా, మరో 7 వేలకుపైగా పోస్టుల నియామక ప్రక్రియ చివరి దశలో ఉందని వెల్లడించారు.

శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ రాష్ట్రంలో ఒకేసారి భారీ సంఖ్యలో మెడికల్ కాలేజీలు పెరగడంతో డాక్టర్ల కొరత ఏర్పడిందన్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులకు అర్హులైన వైద్యులు తక్కువగా ఉండటంతో భర్తీ ప్రక్రియకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత మెడికల్ కాలేజీల్లో 1200 టీచింగ్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేశామని, రెగ్యులర్ ప్రాతిపదికన 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. ఈ నియామక ప్రక్రియ ఏప్రిల్‌లో పూర్తవుతుందని చెప్పారు.

తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో 1616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులను భర్తీ చేస్తున్నామని, ఈ ప్రక్రియ కూడా మరో నెలలో పూర్తవుతుందని తెలిపారు. ఇప్పటికే 7 వేలకుపైగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు భర్తీ కాగా, మరో 2312 పోస్టుల భర్తీ ఏప్రిల్‌లో పూర్తవుతుందని వెల్లడించారు. గత రెండేళ్లలో 1500కు పైగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను కూడా భర్తీ చేశామని చెప్పారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఆస్పత్రి ప్రాంగణాల్లో ప్రైవేట్ మెడికల్ షాపులకు కొత్తగా అనుమతులు ఇవ్వలేదని, ఇప్పటికే ఉన్న వాటిని కూడా తొలగించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కొన్నిచోట్ల కోర్టు స్టే ఆర్డర్ల వల్ల షాపులు కొనసాగుతున్నాయని, అనుమతి రాగానే వాటిని కూడా తొలగిస్తామని చెప్పారు. ప్రజలకు తక్కువ ధరలో మందులు అందించేందుకు జనరిక్ మెడికల్ షాపులను ప్రోత్సహిస్తామని మంత్రి వివరించారు.

# 'వాహన్' పోర్టల్ ప్రారంభం...



- రెండో వాహనంపై అదనపు 2% పన్ను రద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్

**బలగం టీవి, హైదరాబాద్**
బేగంపేటలోని వరుణ్ మోటార్స్ వద్ద రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 'వాహన్' పోర్టల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాల్లో ఇది ఒకటని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు ఇప్పటికే 'వాహన్-సారథి' వ్యవస్థలో భాగంగా ఉన్నాయని, గత ఏడాది తెలంగాణ 'సారథి'లో చేరగా, ఇప్పుడు 'వాహన్' పోర్టల్‌లో చేరడం ద్వారా డిజిటల్ మార్పుకు మరో అడుగు ముందుకు వేసిందన్నారు. ఈ పోర్టల్ ద్వారా రెండో వ్యక్తిగత వాహనం కొనుగోలు చేసే వారికి అమలులో ఉన్న అదనపు 2 శాతం జీవితకాల పన్నును రద్దు చేసినట్లు వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా 15 చెక్ పోస్టులను ఎత్తివేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. షోరూమ్‌లలోనే పారదర్శకంగా వాహనాల రిజిస్ట్రేషన్ జరిగే విధంగా సంస్కరణలు చేపట్టామని పేర్కొన్నారు. రోజుకు సుమారు 1,500 కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్న నేపథ్యంలో ఆధునిక సాంకేతికతతో డేటా నిర్వహణ అవసరమైందని, ఆ అవసరాన్ని 'వాహన్' పోర్టల్ తీర్చనుందని అన్నారు. వాహన రిజిస్ట్రేషన్, ఓనర్‌షిప్ మార్పు, పన్నుల చెల్లింపు వంటి సేవలు ఒకే జాతీయ డేటాబేస్‌లో అందుబాటులోకి రావడం వల్ల సేవలు వేగంగా, పారదర్శకంగా అందుతాయని తెలిపారు. రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ నిర్వహణ, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనలో కూడా ఈ డేటా ఉపయోగపడుతుందని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహానికి ఈవి పాలసీ, స్క్రాప్ పాలసీ అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. ప్రభుత్వ వాహనాల కొనుగోళ్లలో కూడా ఈవీ వాహనాలను ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో డీజిల్ ఆటోలను రీట్రోఫిట్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు చంద్రశేఖర్ గౌడ్, రమేష్, శివలింగయ్య, ఎన్ఐసీ ప్రతినిధి జగదీప్, వరుణ్ మోటార్స్ అధినేత వరుణ్, డీటీసీలు మరియు ఇతర రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్ రద్దుకై రాజ్ భవన్ ముట్టడి..

- ఐఎఫ్‌టీయూ నిరసన

**బలగం టీవి, హైదరాబాద్**
ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్న నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే పూర్తిస్థాయిలో వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐఎఫ్‌టీయూ) సోమవారం 'చలో రాజ్ భవన్' కార్యక్రమం నిర్వహించింది. ఖైరతాబాద్ చౌరస్తా నుంచి రాజ్ భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిన ఐఎఫ్‌టీయూ కార్యకర్తలు అక్కడ బైఠాయించారు.

ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుని కొంత ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ఐఎఫ్‌టీయూ ప్రతినిధి వర్గం గవర్నర్‌కు మెమోరాండం అందజేసింది. జి. అనురాధ అధ్యక్షతన జరిగిన సభలో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను తెలంగాణలో అమలు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖకు పంపాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలు అమలు చేయబోమని ప్రకటించినట్లు గుర్తు చేశారు. లేబర్ కోడ్స్ అమలైతే కార్మికుల మౌలిక హక్కులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, శాశ్వత ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని, సామాజిక భద్రత పథకాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. సీతారామయ్య, సహాయ కార్యదర్శి ఎం.డి. రసుద్దీన్, రాష్ట్ర నాయకులు వెంకటనారాయణ, హెచ్. లింగయ్య తదితరులు పాల్గొన్నారు.




# పపంచ మార్కెట్‌పై ఆధిపత్యం కోసం అమెరికా యుద్ధం



- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- భగత్‌సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం

**బలగం టీవి, హైదరాబాద్**
సామ్రాజ్యవాదం యుద్ధాలను ప్రేరేపిస్తోందనీ, ప్రపంచ మార్కెట్‌పై ఆధిపత్యం కోసం అమెరికా యుద్ధం పేరుతో నర మేధానికి పాల్పడుతోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. భగత్‌సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ముషీరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పీవీ.నర్సింహ్మారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన డాక్టర్ ఎన్.వీ.సుధాకిరణ్ ఆధ్వర్యంలో రక్తదాతలకు బీపీ, షుగర్ టెస్టులు చేశారు. అంతకుముందు భగత్‌సింగ్ చిత్రపటానికి పాలడుగు భాస్కర్ పూలమాల వేసి నివాళ్లర్పించి మాట్లాడారు. నాలుగు వారాలుగా అమెరికా యుద్ధం పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తోందనీ, సంక్షోభం నుంచి బయటపడేందుకే యుద్ధం పేరుతో నర మేధం సృష్టిస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితులను నుంచి గట్టెక్కేందుకు వర్గ పోరాటాలు చేయడమే భగత్‌సింగ్‌కు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. వలసవాదులు, సామ్రాజ్యవాదులను తరిమికొట్టాలనే ఆలోచన కలిగిన వ్యక్తి భగత్‌సింగ్ అన్నారు. జాతీయోద్యమ సమయంలో గాంధీజీ పిలుపునుకు ప్రేరేపితులై కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అనేక జాతీయోద్యమాల్లో తిరుగుబాటుకు నాంది పలికిన గొప్ప మహానుభావుడు భగత్‌సింగ్ అన్నారు. అసమానత, పేదరికం, దోపిడీ పోవాలని వర్గ పోరాటానికి భత్‌సింగ్ నాంది పలికారని తెలిపారు. ఆయన గొప్ప ఆదర్శనీయమైన దార్శనికుడనీ, ఆయన వారసత్వాన్ని మనం తీసుకోవాలని కోరారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీఎస్.రావు, ఎస్‌వీ.రమ, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేశ్, శ్రీకాంత్, సుధాకర్, హైదరాబాద్ సౌత్ జిల్లా సెక్రెటరీ ఎం.శ్రావణ్‌కుమార్, అధ్యక్షులు మీనా, హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షులు దశరథ్, సెక్రెటరీ కుమారస్వామి, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సోమన్న, ఏ.సునిత, హైదరాబాద్ సిటీ నాయకులు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.


# నీటి సంక్షోభానికి దారితీస్తున్న జలాశయాల ఆక్రమణలు

- హైడ్రా కమిషనర్ రంగనాథ్
- జేఎన్‌టీయూహెచ్‌లో ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు

**బలగం టీవి, హైదరాబాద్**
వేగవంతమైన పట్టణీకరణతో జలవనరులపై ఒత్తిడి పెరిగిందని, జలాశయాల ఆక్రమణలు, కాలుష్యం నీటి సంక్షోభానికి దారితీస్తున్నాయని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో ప్రపంచ నీటి దినోత్సవం-2026 వేడుకలు సోమవారం 'జలం మరియు లింగ సమానత్వం' ఇతివృత్తంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్-చాన్సలర్ డా. టి. కిషన్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన హాజరై మాట్లాడారు.

భూమి విలువ పెరగడం కారణంగా ఆక్రమణలు ఎక్కువయ్యాయని, దాదాపు 16 శాతం జలాశయాలు ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. ఇలాంటి ధోరణులు జలవనరులకు కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తాయన్నారు. బఫర్ జోన్లు, సరస్సుల సరిహద్దులు వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యవసరమన్నారు. సహజ వనరుల నిర్వహణలో చురుకైన విధానాలు అవలంబించడం కాలానుగుణ అవసరమని అభిప్రాయ పడ్డారు. తెలంగాణ ప్రభుత్వం హైడ్రా వంటి సంస్థను ఏర్పాటు చేయడంలో చూపిన నిబద్ధతను ఆయన అభినందించారు. భూమి చాలా విలువైన వనరు అని, ఇది సాధారణంగా శక్తివంతమైన వ్యక్తుల నియంత్రణలో ఉంటుందని, అందువల్ల భూ నిర్వహణకు తీసుకునే ఏ చర్యకైనా ప్రతిఘటన ఎదురవుతుందని తెలిపారు.

వీసీ మాట్లాడుతూ 'జలం-లింగ సమానత్వం' అంశం ప్రస్తుత కాలానికి కీలకమని, జల నిర్వహణలో మహిళల పాత్రను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ ఆధారిత జల





పరిపాలనపై చర్చలు నిర్వహించడం సముచితమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఎస్సీ శాస్త్రవేత్త డా. పి. మంజుశ్రీ 'ఏఐ ఆధారిత భూ పరిశీలన'పై ఉపన్యాసం ఇవ్వగా, అనంతరం నిపుణులతో ప్యానెల్ చర్చ జరిగింది. కార్యక్రమాన్ని యూసీఈఎస్టీహెచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు, ప్రొఫెసర్లు, అధికారులు పాల్గొన్నారు.

# 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలి

- బీజేపీ ఎమ్మెల్యేలు


**బలగం టీవి, హైదరాబాద్**
రాష్ట్ర ప్రభుత్వం పైశాచికంగా వ్యవహరిస్తోందని, అధికారంలోకి వస్తే అమలు చేస్తామన్న 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు వెంకట్‌రాంరెడ్డి, హరీశ్‌బాబు, ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటుతున్నా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత లేదన్నారు. ఉద్యోగ విమరణ పొందిన ఉద్యోగులకు బకాయిలు రాక ఇబ్బందులు పడుతున్నారని వాటిపై చర్చ జరగాలని 'చలో అసెంబ్లీ' కార్యక్రమానికి బీజేపీ పిలుపునిచ్చిందన్నారు. అయితే జిల్లాల్లో ఎక్కడికక్కడా తమ పార్టీ కార్యకర్తలను పోలీసులు అరెస్టులు చేశారన్నారు. సోమవారం అసెంబ్లీ బయట జరిగిన అన్ని విషయాలనూ స్పీకర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇలాంటి వ్యవహార శైలి వల్లే బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారని, కాంగ్రెస్‌కు కూడా రాబోయే రోజుల్లో అదే జరుగుతుందని హెచ్చరిం చారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం ఖర్చుపెట్టిన లెక్కలకు.. ప్రవేశపెట్టిన పద్దులకు పొంతనలేదన్నారు. తాము అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తే అరెస్టులు చేస్తున్నారన్నారు. మీరిచ్చిన హామీలను నెరవేర్చాలని, ఆరు గారంటీలకు చట్టబద్ధత చేయాలని నిలదీస్తామన్నారు.



## పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

**జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**
**బలగం టీవి, హైదరాబాద్**
విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పదో తరగతి వార్షిక పరీక్షలు రాయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్) పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్‌టికెట్ల పరిశీలన ప్రక్రియలను సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పరీక్షా గదుల్లో సరిపడ వెలుతురు, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులకు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రంలో మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తరచుగా తనిఖీలు నిర్వహించాలని సూచిం చారు. పరీక్షల సమయంలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఆయన, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ పరిశీలనలో డీఈవో కె. రాము, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## ముస్తాబాద్ మండల బీసీ సాధికారిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుద్దాల దేవయ్య నియామకం..

**బలగం టీవీ, ముస్తాబాద్:**
ముస్తాబాద్ మండల బీసీ సాధికారిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిప్పలపల్లి గ్రామానికి చెందిన సుద్దాల దేవయ్యను నియమించినట్లు బీసీ సాధికారిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య ప్రకటించారు. ఈ నియామకానికి ఉత్తర తెలంగాణ జిల్లాల అధ్యక్షులు పొలాస నరేందర్, రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మెంగని మనోహర్ మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా సుద్దాల దేవయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య, ఉత్తర తెలంగాణ ఇంచార్జి పొలాస నరేందర్, యూత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మెంగని మనోహర్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు నరేంద్ర చారి, అలాగే మండలంలోని అన్ని బీసీ కుల సంఘాల అధ్యక్షులు, సభ్యులు మరియు చిప్పలపల్లి గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ముస్తాబాద్ మండలంలో అన్ని బీసీ కులాలను ఏకం చేస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. కామారెడ్డి సభలో ఇచ్చిన బీసీలకు 42% రిజర్వేషన్ హామీ, బీసీ సబ్ ప్లాన్ నిధుల అమలు, బీసీ కులాలకు జరుగుతున్న అన్యాయాలపై ఉద్యమిస్తామని తెలిపారు. ముస్తాబాద్ మండల వ్యాప్తంగా బీసీ సాధికారిక సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని సుద్దాలా దేవయ్య స్పష్టం చేశారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పర్శ హన్మశీడ్లు...

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన మొగులాల దేవరాజు గౌడ్ అనారోగ్యం తో మృతి చెందాగా వారి కుటుంబాన్ని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మశీడ్లు పరామర్శించి, క్వింటల్ బియ్యం ను అందజేశారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇక్కడ ఉప సర్పంచ్ మెతుకు బాబు, కాంగ్రెస్ సినియర్ నాయకుడు చేట్టి రవి, వార్డు మెంబెర్ గేరిగంటి నరేష్, ముదిరాజ్ సంఘము అధ్యక్షుడు చిరంజీ శంకర్, నాయకులు అంబటి దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.




## ఆశా వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం ఇవ్వాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా

**బలగం టీవీ, పెద్దపల్లి**
ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18,000 చెల్లించాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న తమకు తగిన వేతనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.1,500 ప్రోత్సాహకాన్ని వెంటనే విడుదల చేయాలని కూడా డిమాండ్ చేశారు. తక్కువ జీతాలతో అధిక పనిభారం భరించాల్సి వస్తోందని, ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# భారత మోటార్‌స్పోర్ట్స్ దిగ్గజం హరి సింగ్ మృతి...

- **మాల్దీవుల్లో స్పీడ్‌బోట్ ప్రమాదం**

**బలగం టీవీ, హైదరాబాద్**




భారత మోటార్‌స్పోర్ట్స్ రంగంలో ప్రముఖ ర్యాలీ డ్రైవర్‌గా పేరుగాంచిన హరి సింగ్ మాల్దీవుల్లో జరిగిన స్పీడ్‌బోట్ ప్రమాదంలో మృతి చెందినట్లు సమాచారం. శుక్రవారం వావు అటోల్‌లోని ఫెలిధూ దీవి సమీపంలో ఏడుగురు ప్రయాణిస్తున్న స్పీడ్‌బోట్ తిరగబడడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

మాల్దీవుల అధికారులు హరి సింగ్ మృతదేహం సముద్రంలోని కోరల్ రీఫ్‌లో చిక్కుకుపోయి ఉండొచ్చని ఆయన కుటుంబ సభ్యులకు తెలియజేసినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఈ ప్రమాద సమయంలో పారిశ్రామికవేత్త గౌతమ్ సింఘానియా కూడా స్పీడ్‌బోట్‌లో ఉండగా, ఆయనను సురక్షితంగా రక్షించి ముంబైకి తరలించారు. హరి సింగ్ కుమారుడు మివాన్ భారత్‌కు తిరిగి వస్తున్నట్లు సమాచారం. స్థానిక అధికారులతో ఆయన సన్నిహితులు నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్నారు.

చండీగఢ్‌కు చెందిన హరి సింగ్ భారత మోటార్‌స్పోర్ట్స్ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మక ర్యాలీ డ్రైవర్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. ఇండియన్ నేషనల్ ర్యాలీ ఛాంపియన్‌షిప్ (క్ష్మీచీక్ష్మజ) టైటిల్‌ను ఐదుసార్లు గెలుచుకుని 1990లలో ట్రాక్‌పై ఆధిపత్యం చెలాయించారు. తొలి ఆసియా జోన్ ర్యాలీ ఛాంపియన్‌షిప్‌ను కూడా ఆయన సొంతం చేసుకున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని క్లిష్టమైన మార్గాల్లో సాధన చేసి తన నైపుణ్యాన్ని పెంపొందించుకున్న హరి సింగ్‌కు "ఫ్లయింగ్ సిఖ్", "జిప్సీ కింగ్" అనే బిరుదులు కూడా లభించాయి. అధిక వేగాల్లో నియంత్రించడం కష్టమైన మారుతి సుజుకి జిప్సీ వాహనంపై ఆయనకు ఉన్న పట్టు ప్రత్యేక గుర్తింపును తెచ్చింది. ర్యాలీ కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన అనంతరం జేకే టైర్ మోటార్‌స్పోర్ట్‌లో హెడ్ ఆఫ్ ఆపరేషన్స్‌గా పనిచేశారు. మెర్సిడెస్–బెంజ్ ఇండియాలో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్‌గా కూడా సేవలందిస్తూ యువ డ్రైవర్లకు మార్గనిర్దేశం చేశారు. మోటార్‌స్పోర్ట్స్ రంగానికి చేసిన సేవలకు గాను 2015లో ఫోర్స్ గుర్ఖా ఆర్ఎఫ్‌సీ ఇండియా నుంచి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.

# ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై అక్షర్ పటేల్ అసంతృప్తి

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐపీఎల్‌లో అమల్లో ఉన్న ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై మరో క్రికెటర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ నిబంధన వల్ల ఆల్‌రౌండర్ల ప్రాధాన్యం తగ్గుతోందనే వాదనలు వినిపిస్తున్న వేళ భారత స్టార్ ఆల్‌రౌండర్, ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

అక్షర్ మాట్లాడుతూ, ఈ నిబంధన తనకు అంతగా నచ్చదని వెల్లడించాడు. "నేను స్వతహాగా ఆల్‌రౌండర్‌ను. గతంలో బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ రాణించే ఆటగాళ్లను జట్టులో ఎంపిక చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు టీమ్ మేనేజ్‌మెంట్ అవసరాన్ని బట్టి ప్రత్యేకంగా బ్యాటర్ లేదా బౌలర్‌ను ఉపయోగిస్తోంది. దీంతో జట్టుకు నిజంగా ఆల్‌రౌండర్ అవసరమా అనే చర్చ కూడా తలెత్తుతోంది. అయినప్పటికీ నిబంధనలు నిబంధనలే కాబట్టి వాటిని పాటించాల్సిందే" అని పేర్కొన్నాడు. ఇప్పటికే భారత కెప్టెన్ రోహిత్ శర్మ, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కూడా ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

# క్యాండిడేట్స్ టోర్నీ నుంచి వైదొలిగిన హంపి...

**'యుద్ధ వాతావరణంలో ప్రశాంతంగా ఆడలేను' : హంపి**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఈ నెల 28 నుంచి మధ్య ఆసియాలోని ద్వీప దేశం సైప్రస్‌లో జరగనున్న క్యాండిడేట్స్ చెస్ టోర్నీ నుంచి వైదొలిగిన భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తన నిర్ణయాన్ని సమర్థించుకుంది. యుద్ధ ఉద్రిక్తతల మధ్య ప్రశాంతంగా ఆటపై దృష్టి పెట్టడం సాధ్యం కాదని ఆమె స్పష్టం చేసింది. ఈ విషయమై సోమవారం ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ గత మూడు నెలలుగా టోర్నీ కోసం కఠినంగా సిద్ధమయ్యానని, కుటుంబంతో గడిపే సమయాన్ని కూడా వదులుకుని శిక్షణ పొందానని తెలిపింది. "అలాంటి నేను సరదా కోసం టోర్నీ నుంచి తప్పుకోలేదు. చుట్టూ యుద్ధనౌకలు తిరుగుతున్న పరిస్థితుల్లో ఎలా ప్రశాంతంగా ఆడగలం?" అని ప్రశ్నించింది. 16 మంది పాల్గొనబోయే ఈ టోర్నీ నుంచి హంపి ఒక్కరే వైదొలగడంతో ఆమెపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) జరిమానా విధించే అవకాశమున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆమె స్పందిస్తూ "జరిమానాలు విధించినంత మాత్రాన నిజాలు చెప్పకూడదా? వాటి గురించి నేను భయపడను. నేను డబ్బు కోసం ఆడటం లేదు" అని ఘాటుగా వ్యాఖ్యానించింది. లెబనాన్‌--ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సైప్రస్ సమీపంలో ఇటీవల డ్రోన్ కూలిన ఘటనపై అక్కడి అధ్యక్షుడు ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని హంపి గుర్తుచేసింది.

# కివీస్ క్రికెట్‌లో కలకలం...

**బోర్డు సభ్యుడు డైన్ రాజీనామా**

**బలగం టీవీ, హైదరాబాద్**



న్యూజిలాండ్ క్రికెట్‌లో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో కివీస్ క్రికెట్ బోర్డు సభ్యుడు, మాజీ క్రికెటర్ డైన్ వాష్ తన పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం. కివీస్ క్రికెట్ బోర్డు కొత్త ఫ్రాంచైజీ ఆధారిత టీ20 లీగ్‌ను ప్రారంభించాలని తాజాగా నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా దీఅస్త్ర ధీుంష్ట్ర హాముస్త్రబవలో న్యూజిలాండ్‌కు చెందిన ఓ జట్టును చేర్చాలని ప్రతిపాదించింది. అయితే ఈ నిర్ణయాలు బోర్డు సభ్యుల మధ్య విభేదాలకు దారితీసినట్లు తెలుస్తోంది. ఈ ప్రకటన వెలువడిన కొద్దిగంటల్లోనే డైన్ తన పదవికి రాజీనామా చేసి అందరిని ఆశ్చర్యానికి గురిచేశాడు.

బోర్డు తీసుకున్న నిర్ణయాలకు తాను మద్దతు ఇవ్వలేనని, బాధ్యతల నుంచి తప్పుకోవడానికి ఇదే సరైన సమయమని డైన్ తన ప్రకటనలో పేర్కొన్నాడు. ఇదే తరహా వివాదాల నేపథ్యంలో గత ఏడాది న్యూజిలాండ్ క్రికెట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ స్కాట్ వీనింక్ కూడా పదవి నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా వంటి దేశాలతో పోలిస్తే క్ష్మీభ్రవతీఅఖ్అశీఖుశ్రీ జతీఅప్ఎవ్ జశీబఅఎఅశ్రీ నుంచి న్యూజిలాండ్‌కు వచ్చే ఆదాయం తక్కువగా ఉండటంతో ఆ లోటును భర్తీ చేసేందుకు కొత్త టీ20 లీగ్ ప్రారంభించాలని బోర్డు యోచిస్తున్నట్లు క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి.

# హోటళ్లపై సివిల్ సప్లయ్ అధికారుల దాడులు

**12 హోటళ్లపై కేసులు నమోదు -- 22 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం**

**బలగం టీవీ, హుజూరాబాద్**

లిలిహుజూరాబాద్, సోమవారం:లిలి పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లపై సివిల్ సప్లయ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన 12 హోటళ్లపై కేసులు నమోదు చేసి 22 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

తనిఖీల అనంతరం అధికారులు మాట్లాడుతూ వ్యాపారులు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించరాదని హెచ్చరించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో కేవలం కమర్షియల్ గ్యాస్ సిలిండర్లనే ఉపయోగించాలని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారులు ఉష, సురేందర్, వినోద్, శ్రీనివాస్‌రెడ్డి, అన్వర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# 'కేటీఆర్ టీ స్టాల్'కు ఏడాది పూర్తి

**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు**

**బలగం టీవీ, హైదరాబాద్**



సిరిసిల్ల పట్టణ అభివృద్ధిలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ఏడాది క్రితం ఆయన ఫొటోతో ఉన్న ఓ టీ స్టాల్‌ను తొలగించారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మున్సిపల్ వాహనంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన బత్తుల శ్రీనివాస్ హోటల్ సామగ్రిని తీసుకెళ్లినట్లు తెలిపారు.ఈ ఘటనతో బాధిత కుటుంబానికి కేటీఆర్ బాసటగా నిలిచి, సొంత ఖర్చులతో సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌరస్తాలో 'కేటీఆర్ టీ స్టాల్'ను గత ఏడాది మార్చి 23న ప్రారంభించి శ్రీనివాస్‌కు మనోధైర్యాన్ని అందించినట్లు పేర్కొన్నారు. టీ స్టాల్ ఏర్పాటు చేసి ఏడాది పూర్తవడంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకుడు బొల్లి రామ్మోహన్ ఆధ్వర్యంలో టీ స్టాల్ వద్ద కేక్ కట్ చేసి పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సందీప్, విప్ మల్లికార్జున్ గౌడ్, శంకరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్‌తో ఒప్పందం కోసం ఎదురుచూస్తున్నాం

- **అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఎదురుచూస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇరాన్ విద్యుత్, ఇంధన సదుపాయాలపై దాడులను ఐదు రోజులు వాయిదా వేసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. చర్చల కోసం అమెరికా ముందుగా సంప్రదింపులు జరపలేదని, ఇరానే ముందుగా తమను సంప్రదించిందని పేర్కొన్నారు. ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్ అధికారులు ఆసక్తి చూపుతున్నారని ట్రంప్ తెలిపారు. ప్రస్తుతం అమెరికా రాయబారి స్టీవ్ విట్‌కాఫ్, తన అల్లుడు జారెడ్ కుష్నర్ ఇరాన్‌లోని ఒక ప్రముఖ నాయకుడితో చర్చలు జరుపుతున్నారని వెల్లడించారు. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీతో ఇప్పటివరకు మాట్లాడలేదని చెప్పారు.ప్రపంచ మార్కెట్లలో ఎక్కువ చమురు, గ్యాస్ అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ వద్ద అణు ఆయుధాలు ఉండకూడదని, ఒప్పందంలో భాగంగా యురేనియం నియంత్రణపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. చర్చలు సానుకూలంగా సాగితే సమస్యను పరిష్కరిస్తామని, లేకపోతే దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు.

**ట్రంప్ వ్యాఖ్యలను ఖండించిన ఇరాన్**

అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ఇరాన్ విదేశాంగ శాఖ కొట్టిపారేసింది. వాషింగ్టన్‌--టెహ్రాన్ మధ్య ఎలాంటి శాంతి చర్చలు జరుగడం లేదని స్పష్టం చేసింది. అంతర్జాతీయంగా పెరుగుతున్న ఇంధన ధరలను నియంత్రించేందుకు ట్రంప్ వ్యూహాత్మకంగా ఈ ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించింది. ఇది అమెరికా ఆర్థిక ప్రయోజనాల కోసం తీసుకున్న చర్య మాత్రమేనని పేర్కొంది.

**పశ్చిమాసియా పరిస్థితులపై భారత్ దృష్టి**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను నిశితంగా గమనిస్తున్నామని భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఆ ప్రాంతంలోని కీలక దేశాలతో భారత్ నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తోందని అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వం కోసం భారత్ చర్యలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

# కొలంబియాలో సైనిక విమాన ప్రమాదం...

- **125 మందిలో 48 మంది సజీవంగా రక్షణ**




**బలగం టీవీ, న్యూఢిల్లీ**

దక్షిణ అమెరికా దేశమైన కొలంబియాలో సైనిక రవాణా విమానం కూలిపోవడంతో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ విమానం కుప్పకూలినట్లు అధికారులు తెలిపారు. విమానంలో మొత్తం 125 మంది ప్రయాణిస్తుండగా, అందులో కనీసం 48 మందిని సజీవంగా రక్షించినట్లు వెల్లడించారు. హెర్క్యులిస్ జ-130 రకం సైనిక విమానం పుటుమాయో ప్రావిన్స్‌లోని ప్యూర్టో లెగిజామో ప్రాంతం నుంచి బయలుదేరిన వెంటనే సాంకేతిక సమస్యలతో కూలిపోయింది. ప్రమాద స్థలంలో భారీగా అగ్నికీలలు చెలరేగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఘటన జరిగిన వెంటనే సైనిక బృందాలు, స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

విమానంలో 114 మంది ప్రయాణికులు, 11 మంది సిబ్బంది ఉన్నట్లు వైమానిక దళ కమాండర్ కార్లోస్ ఫెర్నాండో సిల్వా తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదని, విమానం విమానాశ్రయం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో కూలిపోయిందని వివరించారు. గాయపడిన వారిని రాజధాని బొగోటా సహా పలు ఆసుపత్రులకు తరలించేందుకు ప్రత్యేక వైద్య విమానాలను పంపినట్లు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన కొలంబియా అధ్యక్షుడు +బర్ఖుజశీ గ్రావతీశీ, ప్రాణ నష్టం జరగకూడదని ఆకాంక్షించారు. సైన్యంలో ఉపయోగిస్తున్న పాత విమానాలు, పరికరాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రమాదం దేశానికి తీవ్ర వేదన కలిగించిందని రక్షణ మంత్రి పెడ్రో సాంచెజ్ తెలిపారు. ప్రస్తుతం శోధన-రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి.

# జూన్‌లో ఐర్లాండ్ పర్యటనకు టీమిండియా...

**బలగం టీవీ, న్యూఢిల్లీ**




టీ20 ప్రపంచ కప్ 2026ను ఘనంగా ముగించిన భారత జట్టు రాబోయే అంతర్జాతీయ పర్యటనలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో భారత జట్టు జూన్‌లో ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. అక్కడ రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ నిర్వహించనున్నారు.

బోర్డు విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం జూన్ 26న తొలి టీ20, జూన్ 28న రెండో టీ20 మ్యాచ్ జరగనుంది. గత ఎనిమిదేళ్లలో భారత జట్టు మూడుసార్లు ఐర్లాండ్‌లో పర్యటించగా, అన్ని మ్యాచ్‌లు డబ్లిన్ సమీపంలోని మలాహిడ్ వేదికగా జరిగాయి. అయితే 2007 తర్వాత తొలిసారిగా ఈసారి భారత జట్టు బెల్‌ఫాస్ట్‌లో అడుగుపెట్టనుంది.

ఈ పర్యటనకు సంబంధించి సంజు శాంసన్‌ను కెప్టెన్‌గా నియమించే అవకాశమున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. టీ20 ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శనలు చేసిన సంజుకు యువ జట్టును నడిపించే బాధ్యత అప్పగించే యోచనలో బీసీసీఐ ఉన్నట్లు సమాచారం. సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చి యువ ప్రతిభకు అవకాశాలు కల్పించే దిశగా బోర్డు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

ఓపెనింగ్ స్థానాల కోసం కూడా పోటీ నెలకొంది. సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మలకు విశ్రాంతి ఇచ్చే అవకాశముండగా, వారి స్థానాల్లో యశస్వి జైస్వాల్ లేదా యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీలలో ఒకరికి అవకాశం దక్కే అవకాశముంది. ఇదిలా ఉండగా, ఐపీఎల్ 2026 ముగిసిన వెంటనే భారత జట్టు బిజీ షెడ్యూల్‌ను ఎదుర్కోనుంది. ముందుగా అఫ్గానిస్తాన్‌తో ఒక టెస్టు, మూడు వన్డేలు ఆడనుంది. అనంతరం ఐర్లాండ్ పర్యటనలో రెండు టీ20లు, ఆ తర్వాత జూలై 1 నుంచి 19 వరకు ఇంగ్లండ్‌లో ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది.

# ఖమ్మం జిల్లాలో వరుస అగ్నిప్రమాదాలు



**ఓలా షోరూం, కోల్డ్ స్టోరేజీలో మంటలు -- భారీ ఆస్తి నష్టం**

**బలగం టీవీ, ఖమ్మం**

ఖమ్మం జిల్లాలో రెండు వేర్వేరు చోట్ల జరిగిన అగ్నిప్రమాద ఘటనలు కలకలం రేపాయి. ఖమ్మం నగరంలోని రోటరీనగర్ ప్రాంతంలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో మంటలు చెలరేగగా, మరో ఘటనలో మధిర మండలం ఆత్కూర్ సమీపంలోని శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ రెండు ఘటనల్లో ప్రాణనష్టం సంభవించకపోయినా భారీ ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం.

రోటరీనగర్‌లోని ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో అక్కడ ఉన్న పలు బైకులు దగ్ధమయ్యాయి. బ్యాటరీల కారణంగా మంటలు వేగంగా వ్యాపించి దట్టమైన పొగ అలుముకుంది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఛార్జింగ్ సమయంలో లేదా షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

మరో ఘటనలో మధిర మండలం ఆత్కూర్ వద్ద ఉన్న శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలో భారీ మంటలు చెలరేగాయి. అక్కడ నిల్వ ఉంచిన మిర్చి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు మంటల్లో కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. కోల్డ్ స్టోరేజీలోని ఇన్సులేషన్ మెటీరియల్ కారణంగా మంటలను అదుపులోకి తేవడం అగ్నిమాపక సిబ్బందికి సవాలుగా మారింది. ఈ రెండు ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యుత్ ఉపకరణాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు ప్రజలకు సూచించారు.

# షెడ్యూల్ ప్రకారమే ఐపీఎల్ మ్యాచ్‌లు


**బలగం టీవీ, ముంబై**

ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి మ్యాచ్‌లు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని లీగ్ వర్గాలు స్పష్టం చేశాయి. మార్చి 28 నుంచి టోర్నమెంట్ ప్రారంభం కానుండగా, విదేశీ ఆటగాళ్ల అందుబాటు, గాయాల సమస్యలపై తుది నిర్ణయం ఆయా ఫ్రాంచైజీలదేనని వెల్లడించాయి. ఇప్పటికే పలువురు విదేశీ క్రికెటర్లు తమ జట్లతో చేరాల్సి ఉండగా, మరికొందరు గాయాల కారణంగా మ్యాచ్‌లకు దూరంగా ఉండే అవకాశముంది. ఈ పరిస్థితుల్లో ఆటగాళ్ల ఎంపిక, జట్టు కూర్పు వంటి అంశాలను ఫ్రాంచైజీలు స్వయంగా చూసుకోవాల్సి ఉంటుందని లీగ్ నిర్వాహకులు తెలిపారు. పాలకవర్గం ఈ విషయంలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకునే అవకాశం లేదని పేర్కొన్నారు. అయితే టోర్నమెంట్ నిర్వహణలో ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. క్రికెట్ అభిమానుల కోసం మ్యాచ్‌లు యథావిధిగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

# మైక్రోఫైనాన్స్ అక్రమ వసూళ్లపై మంగ్లీ క్లారిటీ

**తన పేరుతో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండించిన గాయని**

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రముఖ గాయని మంగ్లీ పేరు చెప్పుకుని కొందరు వ్యక్తులు మైక్రోఫైనాన్స్ పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే వార్తలు కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగ్లీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. తనకు ప్రొఫెషనల్ ఈవెంట్స్ మినహా ఎలాంటి ఇతర వ్యాపారాలు లేవని, ముఖ్యంగా మైక్రోఫైనాన్స్ రంగంతో తనకు లేదా తన కుటుంబానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కరెన్సీ కట్టలకు సంబంధించిన వీడియోలకు కూడా తన ఇంటితో ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. కావాలనే తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన ఆమె, ఈ వ్యవహారంలో బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. తన పేరును వాడుకుంటూ ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులతో తనకు ఎలాంటి పరిచయం లేదని తేల్చిచెప్పారు. తనను లేదా తన తమ్ముడిని కేవలం షోలు, ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం మాత్రమే సంప్రదిస్తారని, అది ఆహ్వానాల వరకే పరిమితమని వివరించారు.

balagamtv100@gmail.com

# 'ధురంధర్2' తీయడం వెనక పక్కా రాజకీయ వ్యూహం




రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన 'ధురంధర్ 2' ప్రస్తుతం బాక్సాఫీస్ దగ్గర కాసులు కురిపిస్తోంది. ప్రేక్షకుల భావోద్వేగాలను అడ్డుగా పెట్టుకొని, నిజ జీవితంలో రాజకీయంగా తీసుకున్న నిర్ణయాలు ప్రజల మంచికోసమని చెప్పే ప్రయత్నాన్ని దర్శకుడు ఆదిత్య ధర్ ఈ సినిమా ద్వారా చేశారు. అయితే ఎవరి ఆదేశాల ప్రకారం, ఎవరి అడుగులకు మడుగులు ఒత్తడం కోసం ఈ పనిచేశారో ఆయనకే తెలియాలి. దేశవ్యాప్తంగా ప్రజల మనసుల్లో, ప్రేక్షకుల ఆలోచనా భావాల్లో విద్వేషపూరిత చీలిక తెచ్చే ప్రయత్నం మాత్రం చేశారు. రాజకీయాల్లో కొన్ని నిర్ణయాలు తీసుకున్నప్పుడు ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతాయి. కానీ, 'ధురంధర్ 2'లో ఆ నిర్ణయాల వెనుక ఉన్న 'మంచితనాన్ని' లేదా 'అవసరాన్ని' భావోద్వేగపూరితంగా చూపించే ప్రయత్నం చేశారు. ఒక నాయకుడు కఠినమైన నిర్ణయాలు తీసుకున్నా, అది ప్రజల కోసమే అనే భావనను ప్రేక్షకుల మనసులో బలంగా నాటడమే ఈ సినిమా అసలు లక్ష్యం. రణవీర్ సింగ్ లాంటి మాస్ ఫాలోయింగ్ ఉన్న హీరోను ఎంచుకోవడం వెనుక పెద్ద ప్లాన్ ఉంది. యువతను, సామాన్య ప్రజలను ఆకర్షించడంలో ఆయనకున్న క్రేజ్ సినిమాలోని రాజకీయ సందేశాన్ని త్వరగా జనాల్లోకి తీసుకెళ్తుంది. నాయకుడి వ్యక్తిత్వాన్ని ఒక 'ప్రజా పోరాట యోధుడు' గా చూపించి రాజకీయ మైలేజ్ పొందాలనే వ్యూహం స్పష్టంగా కనిపించింది. ఇలాంటి సినిమాలు సాధారణంగా ఎన్నికల ముందు లేదా రాజకీయంగా కీలకమైన సమయాల్లోనే విడుదలవుతుంటాయి. 'ధురంధర్ 2' కూడా సరైన సమయంలో రావడం వల్ల, ఓటర్లలో ఒక రకమైన సానుకూలతను సృష్టించేందుకు ఇది ఒక 'రాజకీయ అస్త్రం'లా పనిచేస్తుంది. సినిమాలో ప్రతి అడుగును 'మాస్టర్ స్ట్రోక్' గా చూపిస్తారు. వాస్తవానికి రాజకీయాల్లో లాభనష్టాలు రెండూ ఉంటాయి, కానీ స్క్రీన్ మీద కేవలం విజయాలను, త్యాగాలను మాత్రమే హైలైట్ చేస్తారు. సినిమా ద్వారా రాజకీయ నిర్ణయాలను పాలిష్ చేసి, అవి సరైనవే అని ప్రజలను నమ్మించే ప్రయత్నం వంద శాతం వాస్తవం. ఏ రాజకీయ సినిమా అయినా 60% వాస్తవం, 40% నాటకీయత తో ఉంటుంది. 'ధురంధర్ 2' విషయంలో కూడా ఆ ప్లాన్ పక్కాగా అమలు జరిగిందని చెప్పొచ్చు. అయితే రణవీర్ సింగ్ నటన ఆ రాజకీయ సందేశానికి మరింత బలాన్ని చేకూర్చింది.

# మెగాస్టార్ చిరంజీవి కామెంట్స్ భగ్గుమన్న ఏపీ నెటిజెన్లు



మెగాస్టార్ చిరంజీవి సామాజిక మాధ్యమాల్లో దారుణమైన ట్రోలింగ్ ను ఎదుర్కొంటున్నారు. తన సొంత రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ను పట్టుకొని పక్క రాష్ట్రం అని మాట్లాడటం,పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి అని మాట్లాడటంపై నెటిజన్లు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. దీనికి సంబంధించి వెబ్ సైట్లలో ఏ వార్త చూసినా,యూట్యూబ్,ఫేస్ బుక్,ఇన్ స్టాగ్రామ్ లో ఏ వీడియో చూసినా దానికింద వందల సంఖ్యలో,వేల సంఖ్యలో చిరంజీవికి వ్యతిరేకంగా కామెంట్లు వస్తున్నాయి. ఇది చూసి మెగా అభిమానులు కూడా ఆశ్చర్యపోతున్నారు. తమ హీరోపై ఇంత వ్యతిరేకత ఉందా? అనుకుంటున్నారు. మనం మాట్లాడేటప్పుడు ఆచితూచి మాట్లాడాలని పెద్దలు చెబుతారు. అయితే చిరంజీవి సాధారణమైన ఉద్దేశంతో అన్నప్పటికీ, అది అప్పటికే తీవ్ర వ్యతిరేకతను క్షణాల్లో మూటగట్టుకొచ్చింది. తెలంగాణ గద్దర్ అవార్డుల సమయంలో ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఒక్కసారిగా నెటిజన్లు తగులుకున్నారు. సొంత రాష్ట్రాన్ని పట్టుకొని పక్క రాష్ట్రం అన్నావంటే..నీకు రాష్ట్రం పై ఏమాత్రం ప్రేమ లేదని,ఇళ్లు కట్టుకొని హైదరాబాద్ లో స్థిరపడ్డారని విమర్శిస్తున్నారు. పన్నులు తెలంగాణలోనే కడుతున్నారు...మూడు రాజధానులకు మద్దతు పలికావు..నీ తమ్ముడు పవన్ కల్యాణ్ పై రాజకీయ దాడులు జరుగుతుంటే అడ్డుకోలేదని గుర్తు చేసిన నెటిజెన్లు...రేవంత్ రెడ్డి ముందు చంద్రబాబును చులకన చేసి మాట్లాడావని దాన్ని జీర్ణించుకోలేకున్నామంటూ పోస్టులు పెడుతున్నారు. ఎవరైనా అలా మాట్లాడతారా? రాజకీయ దురంధరుడైన చంద్రబాబు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న గద్దర్ అవార్డులను చూసి స్ఫూర్తి తెచ్చుకోవాలా? విడిపోయిన రాష్ట్రానికి సినీ ప్రముఖులెవరైనా మద్దతు పలికారా? అంటూ పెద్ద ఎత్తున ప్రశ్నిస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సినిమా టికెట్లు పెంచుకోవడానికి అనుమతులు తెచ్చుకుంటున్నారుకానీ ఒక్కరు కూడా వచ్చి చంద్రబాబును,పవన్ కల్యాణ్ ను కలవలేదని చెబుతున్నారు.కానీ వారు మానవత్వంతో టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తున్నారన్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు.వాస్తవానికి సినీ పరిశ్రమకు ఏం చేయాలనే విషయమై కూటమి ప్రభుత్వం వద్ద ఒక ప్రణాళిక ఉంది.కానీ మీలాంటి హీరోలను,దర్శకులను,నిర్మాతలను చూసినతర్వాత వారికి కూడా ఏమీ చేయాలనిపించడంలేదని అర్థమవుతోందని చెప్పుకొస్తున్నారు.ప్రజలు కూడా మీకు మద్దతుగా నిలవడం లేదని చెప్పిన నెటిజెన్లు...మీకు ఎక్కువగా ఆదాయం వచ్చేదే ఏపీ నుంచని అటువంటి ఏపీని పక్క రాష్ట్రం అన్న తర్వాత ఈ రాష్ట్రంలో సినీ పరిశ్రమకు,పరిశ్రమ పెద్దలకు గౌరవం ఉండదని బాహాటంగానే స్పష్టం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుల సమయంలో చిరంజీవి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అగ్గి రాజేస్తున్నాయి. అయితే చిరంజీవి కామెంట్స్‌తో కదిలిన ప్రభుత్వం త్వరలోనే ఏపీలో కూడా అవార్డులను ప్రకటిస్తామని సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఒక

# దయచేసి నన్ను సినిమాల్లో పెట్టుకోండి:



## రాజశేఖర్ రిక్వెస్ట్

యాంగ్రీ హీరో రాజశేఖర్ గతంలో ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాల్లో హీరోగా నటించారు. సినిమాలు చేయకపోయినా ఎప్పటికీ క్రేజ్ ఉండే హీరోల్లో రాజశేఖర్ ఒకరు. ఇటీవలి కాలంలో ఆయన సినిమాలు తగ్గించిన విషయం తెలిసిందే. గతంలో నితిన్ ఎక్స్ ట్రా ఆర్డినరీ మూవీలో రాజశేఖర్ కనిపించారు. అయితే అనారోగ్య కారణాలతోనే ఆయన సినిమాలు చేయడం లేదని తెలుస్తోంది. ఇక ఇటీవల రాజశేఖర్.. అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకుని సినిమాల్లో జోష్ పెంచినట్లు సమాచారం. ఇప్పుడు ఈ సీనియర్ హీరో మూడు చిత్రాల్లో నటిస్తున్నట్లు తెలుస్తోంది.టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ నటించిన బైకర్ మూవీలో రాజశేఖర్ కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా రిలీజైన ట్రైలర్ చాలా అద్భుతంగా ఉంది. ట్రైలర్ చూస్తుంటే ఈ మూవీలో శర్వానంద్ తండ్రిగా రాజశేఖర్ నటించినట్లు తెలుస్తోంది. అయితే ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ వేడుకలో రాజశేఖర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మూవీలో శర్వానంద్ హీరోగా చేస్తున్నారని.. తాను సెకండ్ హీరోగా చేస్తున్నానని అన్నారు. "అయ్యో సెకండ్ లెవెల్ లోకి వెళ్లిపోయామనే బాధ నాలో ఉంది. అయితే మా పిల్లలు అన్నారు. అప్పట్లోలా లేదు ఇప్పుడు అంతా ఒకటే.. సో.. సెకండ్ లెవెల్ అనుకోవద్దు అని నా పిల్లలు అన్నారు. ఇప్పుడు నేను అడ్జస్ట్ అయిపోయాను. నేను మీకు అందరికీ రిక్వెస్ట్ చేస్తున్నా.. ఏంటంటే..? నన్ను ఎక్కువ సినిమాల్లో పెట్టుకోండి.." అని రాజశేఖర్ తెలిపారు. ఆయన కామెంట్స్ సోషల్ మీడియాలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇక 'బైకర్' మూవీకి అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ మూవీలో మాళవికా నాయర్ హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే ఈ మూవీలో బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీని యూవీ క్రియేషన్స్ బ్యానర్ పై వంశీ కృష్ణ రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మించారు. ఈ మూవీ ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# తెలుగు సినిమాతో సెకండ్ ఇన్నింగ్స్?



స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లితో వివాహానంతరం సినిమాలకు బ్రేక్ తీసుకుంది అగ్ర కథానాయిక అనుష్కశర్మ. సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటూ పాత్రలపరంగా వైవిధ్యానికి ప్రాధాన్యతనిస్తుందని ఆమెకు బాలీవుడ్‌లో మంచి పేరుంది. ఈ నేపథ్యంలో అనుష్కశర్మ కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌ను మొదలుపెడుతూ తెలుగులో ఓ క్రేజీ ప్రాజెక్ట్‌లో భాగం కాబోతున్నట్లు తెలిసింది. అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సైంటిఫిక్ ఫాంటసీ చిత్రంలో అనుష్క శర్మ కీలక పాత్రలో నటించనుందని వార్తలొస్తున్నాయి. 'పుష్ప' ఫ్రాంఛైజీ తర్వాత అల్లు అర్జున్ చేస్తున్న సినిమా ఇదే కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ హైప్ నెలకొని ఉంది. ఈ సినిమాలో అనుష్కశర్మ నటించడం ఖాయమని, ఇప్పటికే చిత్రబృందం ఆమెతో చర్చల్ని పూర్తి చేసిందని బాలీవుడ్ మీడియాలో కథనాలొచ్చాయి. రెండు సమాంతర ప్రపంచాల నేపథ్య కథాంశంతో హాలీవుడ్ స్థాయి ప్రమాణాలతో దర్శకుడు అట్లీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దీపికా పడుకోన్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్, రష్మిక మందన్న కూడా నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'ఏఏ22' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది ద్వితీయార్థంలో పూర్తవబోతున్నట్లు సమాచారం.




# జూన్‌లో మల్టీస్టారర్ షురూ

ఈ ఏడాది 'మనశంకర వరప్రసాద్‌గారు' చిత్రంతో భారీ విజయాన్ని దక్కించుకున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఈ విజయోత్సాహంలో ఆయన తదుపరి చిత్రానికి సిద్ధమవుతున్నారు. వెంకటేష్, కల్యాణ్‌రామ్ కలిసి నటించనున్న ఈ మల్టీస్టారర్ జూన్ నెలలో సెట్స్ మీదకు వెళ్లనున్నట్లు సమాచారం. షైన్‌స్క్రీన్స్, సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. దర్శకుడు అనిల్ రావిపూడి తనదైన హాస్యం, యాక్షన్ అంశాల కలబోతగా ఈ సినిమా స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారట. ఇందులో ఓ కథానాయికగా కీర్తి సురేష్‌ను ఖరారు చేశారని, మరో నాయిక కోసం చిత్రబృందం అన్వేషణలో ఉందని సమాచారం. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటిస్తున్నారు వెంకటేష్. చిత్రీకరణ జరుగుతున్నది.

ఇది పూర్తయిన వెంటనే అనిల్ రావిపూడి మల్టీస్టారర్‌లో వెంకటేష్ జాయిన్ కానున్నారు. ఈ సినిమాను కూడా వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో దించేందుకు సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.



# ఎంట్రీ సాంగ్ కోసం స్పెషల్ సెట్?

కల్కి 2' షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా అని దేశవ్యాప్తంగా ఉన్న సినీప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూశారు. ఎట్టకేలకు దర్శకుడు నాగ్‌అశ్విన్ 'కల్కి 2' షూటింగ్‌ని ఓ నెల క్రితం మొదలుపెట్టారు. కమల్‌హాసన్, అమితాబ్‌లపై కీలక సన్నివేశాలను, ఓ ఫైట్ సీక్వెన్స్ కూడా షూట్ చేసినట్టు తెలిసింది. రీసెంట్‌గా ఈ షూట్‌లోకి దుల్కర్ సల్మాన్ ఎంట్రీ ఇచ్చారు. ప్రస్తుతం అమితాబ్, దుల్కర్‌లకు సంబంధించిన సీన్స్ తీస్తున్నారట దర్శకుడు నాగ్‌అశ్విన్. ఇదిలావుంటే.. నెక్ట్స్ షెడ్యూల్ కోసం ఓ ప్రత్యేకమైన భారీ సెట్‌ను నిర్మిస్తున్నారు. ఈ సెట్‌లోనే ప్రభాస్ ఎంట్రీ సాంగ్‌ని షూట్ చేస్తారట. ఈ పాటలో ప్రభాస్‌తోపాటు దుల్కర్ సల్మాన్ కూడా ఉంటారని వినికిడి. కమల్‌హాసన్ ప్రధాన ప్రతినాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో సాయిపల్లవి కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. 'కల్కి 2898ఏడీ' చిత్రం కర్ణుడి పాత్ర ఆగమనంతో ముగిసింది. ఈ సినిమా ఆద్యంతం కర్ణ పాత్రే ప్రధానంగా సాగుతుందట. అందుకే ఈ సినిమాకు 'కర్ణ 3102 బీసీ' అనే టైటిల్ కూడా అనుకుంటున్నారు. వీటికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సివుంది.